సూర్య
18 వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గురువారం | 7 నవంబర్ 2024 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 16
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం...నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుదినం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, కార్తీక మాసం షష్టి రా.8.52, పూర్వాషాఢ ఉ.9.26 వర్జ్యం సా.5.22 నుంచి 6.57 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.9.52 నుంచి 10.37 వరకు తిరిగి మ.2.21 నుంచి 3.06 వరకు



## అగ్రరాజ్యాధినేతగా
# డొనాల్డ్ ట్రంప్


- రెండోసారి అధ్యక్షుడిగా శ్వేత సౌధంలోకి
- అమెరికాకు ఇది గోల్డెన్ ఏజ్ అన్న ట్రంప్
- భారత ప్రధాని మోడీ సహా ప్రపంచ దేశాల అభినందనలు
- అపఖ్యాతితో వదిలి వెళ్లిన వైట్ హౌస్ లోకి సగర్వంగా పునరాగమనం

వివరాలు-3లో

### చరిత్రాత్మక విజయం

అగ్రరాజ్యం అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. అమెరికాలోని పత్రికలు జరిపిన సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకమని తేల్చినా.. ప్రజలు మాత్రం అండగా నిలిచారు. కొంత విరామంతో ఒక అభ్యర్థి అమెరికా అధ్యక్ష స్థానంపై తిరిగి కూర్చోవడం 131 ఏళ్ల తర్వాత ఇదే. అంతేకాదు.. ఎన్నికలకు ముందు కోర్టు కేసులు ఇబ్బంది పెట్టినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా చివరి వరకూ పోరాడారు.

## మిత్రుడు ట్రంప్‌కు
# శుభాకాంక్షలు


6 లో

- హృదయపూర్వక అభినందనలు మిత్రమా అంటూ
- డొనాల్డ్ ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపిన మోడీ
- ఇద్దరమూ కలిసి పనిచేద్దామని పిలుపు

ప్రపంచ దేశాలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన అమెరికా ఎన్నికలు 2024 ఫలితాలు రానే వచ్చేసాయి. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి గెలుపొందారు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు


5 లో

- ట్రంప్ విజయంతో మార్కెట్‌లో హవా
- 901 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
- 270 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 4 శాతానికి పైగా లాభపడ్డ టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు

## 'మహా'లో ఎన్సీపీ మ్యానిఫెస్టో విడుదల


6 లో

- 100 రోజుల్లో కొత్త మహారాష్ట్ర విజన్
- గ్రామీణ ప్రాంతాల్లో 2.5 మిలియన్ల ఉద్యోగాలు
- మహిళలకు రూ.1500 నుంచి రూ.2100కు పెంపు
- వరి రైతులకు హెక్టారుకు 25 వేల బోనస్

## గడియారం గుర్తుపై సుప్రీం డెడ్‌లైన్


6 లో

- 36 గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వాలని అజిత్ పవార్‌కు ఆదేశం
- అజిత్ పవార్ వర్గానికి కేటాయించడాన్ని సవాల్ చేసిన శరద్ పవార్
- కేసు విచారణ ఈనెల 13కు వాయిదా

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## రూ.1000 కోట్ల పెట్టుబడుల
# సాధనే లక్ష్యం

- ఏపీ డ్రోన్ పాలసీకి ఆమోదం
- ఏపీ డేటా సెంటర్ పాలసీసెమీకండక్టర్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీలకు ఆమోదం
- ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు-2024 ముసాయిదాకు ఆమోదం
- 2014-19 నాటి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం.. కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమ
- జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సు 60 నుండి 61కి పెంపు
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పునరుద్ధరణ


2 లో

## పేద విద్యార్థులకు కేంద్రం
# శుభవార్త


6 లో

- పీఎం విద్యాలక్ష్మితో 22 లక్షల మందికి లబ్ధి
- విద్యాలక్ష్మి పథకం కింద రూ.7.50లక్షల వరకు రుణం
- రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి వర్తిస్తుంది
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

## మంత్రి నారా లోకేశ్‌ను
# అభినందించిన మంత్రులు


2 లో

- ఇటీవల అమెరికాలో లోకేశ్ పర్యటన
- లోకేశ్ టూర్ గ్రాండ్ సక్సెస్ అయిందన్న మంత్రులు
- లోకేశ్ అలుపెరుగని కృషి చేశారని కితాబు

ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు ఇవాళ ఇతర మంత్రులు అభినందనలు తెలియజేశారు. ఏపీ కేబినెట్ మంత్రులు ఉండవల్లిలోని లోకేశ్ నివాసానికి వచ్చారు. లోకేశ్ ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అమెరికాలో వారం రోజుల పాటు సాగించిన పెట్టుబడుల యాత్రను లోకేశ్ గ్రాండ్ సక్సెస్ చేశారని మంత్రులు కొనియాడారు.

## అంతా ఇంతే!




వచ్చే సారి కూడా సీఎం మీరే సార్

## నాణ్యమైన మద్యం
# దిశగా ప్రభుత్వం

నాణ్యమైన మద్యంను వినియోగదారులకు అందించాలన్న లక్ష్యం మేరకు ప్రభుత్వం నూతనంగా విభిన్న ప్రమాణికాలు మేరకు పరీక్షలు నిర్వహిస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.


2 లో

- ప్రాంతీయ ప్రొబెషనరీ, ఎక్సైజ్ లేబొరేటరీలలో అత్యాధునిక గ్యాస్ క్రోమోటోగ్రఫీ
- బ్లైండ్ పరీక్షకు 9, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ పరీక్షించడానికి 13 పరిమితులు
- మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకు ఉపకరించేలా ప్రభుత్వ చర్యలు

## మెగా డీఎస్సీ
# వాయిదా


7 లో

- ఐదారు రోజుల్లో నోటిఫికేషన్
- ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంలో ప్రభుత్వం
- అభ్యర్థుల్లో ఆందోళన

ఏపీ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. గెలిచిన తరువాత ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బుధవారం నోటిఫికేషన్‌ విడుదల పైన సంకేతాలు ఇచ్చారు. కానీ, చివరి నిమిషంలో నిర్ణయం మారింది.



## కేంద్ర మంత్రి అమిత్ షాతో
# పవన్ కల్యాణ్ భేటీ

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పవన్ అమిత్‌షాతో సమావేశమయ్యారు. సహకార శాఖ నుంచి నిధుల కేటాయింపుపై అమిత్ షాతో పవన్ చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్రానికి రావాల్సిన నిధుల అంశం ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.

వివరాలు లోపలి పేజీల్లో

## విభజన రాజకీయాలను
# తిప్పి కొట్టండి



- వాయనాడ్ ప్రజలకు ప్రియాంక గాంధీ పిలుపు
- ఉప ఎన్నికల ప్రచారంలో ప్రియాంకాగాంధీ బిజీబిజీ
- పోక్కొట్టుంపడంలో బహిరంగ సభలో ప్రసంగించిన ప్రియాంక గాంధీ

వివరాలు-6లో



# తిరుమల పవిత్రత కాపాడతాం భక్తులు సేవకు సమిష్టి కృషి చేయాలి

తిరుమల : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తెలియజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకృత ఎతమన్నారు. భక్తులకు సేవ చేసేందుకు మీడియాతో సహా ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్స వాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహి ంచిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడేం దుకు, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధికారులు సమిష్టి కృషిని కొనసాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు టీటీడీ సీనియర్ అధికారుల ందరితో ఛైర్మన్ పరిచయ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఈవో జె.శ్యామ లరావు టీటీడీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమర్పించారు. తిరుమల ఆలయం, స్థానిక దేవాల యాలు, అన్నప్రసాదం, విజిలెన్స్, ఆరోగ్యం, రవాణా, విద్యా సంస్థలు ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రులు, మెడికల్, పిఆర్ వింగ్, రిసెప్షన్, కళ్యాణకట్ట, హిందూ ధార్మిక ప్రాజెక్టులు, యాత్రికుల దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలను చూసుకోవడంతో పాటు తమ నిబద్ధతతో సంస్థ ఖ్యాతిని అన్ని స్థాయిలలో ముందుకు తీసుకెళ్లడంలో ఉద్యోగులు అంకితభావంతో ఉన్నారని ఈవో తెలిపారు.

# రూ.1000 కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యం

**● ఏపీ డ్రోన్ పాలసీకి ఆమోదం ● ఏపీ డేటా సెంటర్ పాలసీ సెమీకండక్టర్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీలకు ఆమోదం ● ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు-2024 ముసాయిదాకు ఆమోదం ● సీఆర్డీఏ సహజ పరిధి అయిన 8,352 చ.కి. పునరుద్ధరించేందుకు గ్రీన్ సిగ్నల్ ● 2014-19 నాటి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం.. కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమ ● జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సు 60 నుండి 61కి పెంపు ● కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పునరుద్ధరణ ● పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తే.దీ.06.11.2024న బుధవారంరాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్రసచివాలయంలో జరిగిన ఐదో ఇ-క్యాబినెట్ సమావేశంలోపలు కీలక అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.. వాటి వివరాలు ఇవి.

**1.మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడులు:**

-ఆంధ్రప్రదేశ్ డ్రోన్ పాలసీ 4.0 కి మంత్రిమండలి ఆమోదం తెలిపింది..డ్రోన్ వినియోగాభిరుచిని పెంచేలా.. అత్యవసర, ఇతర సేవలను వేగవంతం చేసేలా రాష్ట్ర డ్రోన్ కార్పొరేషన్ రూపొందించిన ఈ పాలసీకి ఆమోదం తెలపడం జరిగింది..

-రాష్ట్రాన్ని డ్రోన్ హబ్‌గా మార్చే దిశగాప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. దీనికోసం కర్నూలులో డ్రోన్ డెవల్‌పమెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

-ప్లగ్ అండ్ ప్లే విధానంలో డ్రోన్ డెవల్‌పమెంట్, ట్రైనింగ్, తయారీ కేంద్రాన్ని కర్నూలులో ఏర్పాటు చేయడం జరుగుతుంది..

-ఈ పాలసీతో రాష్ట్రంలో వందకుపైగా డ్రోన్ తయారీ కంపెనీలు ఏర్పాటవుతాయి.

-దాదావు 20 డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రాలు, 50 నైపుణ్యాభివృద్ధి సంస్థలను స్థాపించే అవకాశం ఉంటుంది.

-డ్రోన్ రంగంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు, రూ.3,000 కోట్ల రాబడి వస్తుందని అంచనా.డ్రోన్ పాలసీతో ప్రత్యక్షంగా 15 వేల మందికి, పరోక్షంగా 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**2.ఇన్ఫర్మేషన్ టక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్:**

-ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీ 4.0 కి మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

-ఈ పాలసీ ద్వారానియమితకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 200 మెగావాట్ల అదనపు డేటా సెంటర్ సామర్థ్యాన్ని చేర్చడమే లక్ష్యం.

-కృత్రిమ మేధస్సు () సామర్థ్యాలతో కూడిన అధునాతన డేటా సెంటర్ల నుండి పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు పెద్ద స్థాయి డేటా ఎంబసీల మరియు డేటా సెంటర్ పార్కులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్నుమార్చడంపైదృష్టి సారించడం జరుగుతుంది.

-ప్రతిపాదిత డేటా సెంటర్ విధానం (4.0) 2024-29 ఆధునిక డేటా సెంటర్ల నుండి ఆర్థిక పెట్టుబడులను ఆకర్షించడానికి ఆశించబడుతోంది.

**3.ఇన్ఫర్మేషన్ టక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్:**

-ఆంధ్రప్రదేశ్ సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ (4.0) కి మంత్రిమండలి ఆమోదం తెలిపింది

-సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ప్రభుత్వం మొదటిసారి ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0 కి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. -2024-29 మధ్య కాలంలో అమలు ఉండేలా దీనిని రూపొందించడం జరిగింది.. -కేంద్రం 50 శాతం రాయితీని దశలవారీగా అందజేయడం జరుగుచున్నది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 30 శాతం వరకూ పలు రకాల రాయితీలను అందించనున్నది. -అమెరికా, యూరప్ దేశాలకు సంబంధించిన పలు సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఏర్పాటయ్యాయి.. అదేవిధంగాఆంధ్రప్రదేశ్ ను కూడా తీర్చిదిద్దేందుకు ఈపాలసీ ఎంతగానో ఉపయోగపడుతుంది. -ఆయా రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు ఇస్తోంది..దాదావు 30 శాతం రాయితీలను రాష్ట్రప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది. -ఈ నేపథ్యంలో.. చిప్‌లు, సెమీకండక్టర్ల తయారీ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఈ కొత్త విధానాన్ని తీసుకు వచ్చింది.

-డ్రోన్ పాలసీ మరియు సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వడం జరుగుతుంది..

**4.రెవిన్యూ (ల్యాండ్స్):**

-.. ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) చట్టం -1982 ని రద్దు చేస్తూ . ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) బిల్లు-2024 అమలుకు సంబంధించిన ముసాయిదా బిల్లు ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రమంత్ర మండలి ఆమోదం తెలిపింది.

-ల్యాండ్గ్రాబింగ్కుపాల్పడేవారిని కఠినంగా శిక్షించే విధంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాము.

-10 నుండి 14 సంవత్సరాలు పాటు శిక్ష, గ్రాబ్ చేయ బడిన ల్యాండ్ విలువతో పాటు నష్టపరిహారాన్ని కూడా వసూలు చేయడం జరుగుతుంది.

-గుజరాత్, కర్ణాటలోని చట్టాలను కూడా పరిగణిలోకి తీసుకుంటూ ఈ చట్టాన్ని రూపొందించడ జరిగింది.

-ప్రభుత్వ భూముల రక్షణకు పదునైన చట్టం అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నకసరత్తులోభాగంగాప్రభుత్వంఈనిర్ణయంతీసుకుంది.

-గత ప్రభుత్వహయాంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు కూటమి ప్రభుత్వం గుర్తించింది.

**5.పంచాయితీరాజ్గ్రామీణాభివృద్ధి:**

-2014-19మధ్యకాలంలోజరిగిన అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం చెల్లింపులు చేయకపోగా వారిపై విజిలెన్స్ ఎంక్వైరీ వేసి ఆర్థికంగా, మానసికంగా వేధించడంతో వారందరూ కోర్టును ఆశ్రయించారు.

-ఈ నేపథ్యంలో.. 4.45 లక్షల పనులకు సంబంధించి గుత్తేదారులకు రూ.331 కోట్లు చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సదరు కాంట్రాక్టర్లకు 12 శాతం వడ్డీ కూడా ఇవ్వాలన్న విషయంపై ప్రభుత్వం పరిశీలన చేస్తోంది.

**6.ఆర్థిక శాఖ:**

-ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్‌యాన్యుయేషన్) చట్టం - 1984 పరిధిలోకి వచ్చే జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సును 60 నుండి 61 సంవత్సరాలకు తే.01.11.2024దీనుండి పెంచడానికి సంబందిత చట్టంలోని సెక్షన్ 3(1) ని సవరించడానికి రూపొందించిన ముసాయిదా బిల్లుకు రాష్ట్రమంత్ర మండలి ఆమోదం తెలిపింది.

**7.రెవిన్యూ (వాణిజ్యపన్నులు):**

-ఆంధ్రప్రదేశ్ వస్తువులు మరియు సేవల పన్ను చట్టం, 2017 (2017 చట్టం 16)ను సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ వస్తువులు మరియు సేవల పన్ను (సవరణ) బిల్లు, 2024 ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

**8.రెవిన్యూ (ఎక్సైజ్) :**

-ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ (సవరణ) ఆర్డినెన్స్, 2024 (.. ఆర్డినెన్స్ నం.4 ఆఫ్ 2024), ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ (సవరణ) ఆర్డినెన్స్, 2024 (.. ఆర్డినెన్స్నం.5 ఆఫ్ 2024) మరియు ఆంధ్రప్రదేశ్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, ఫారిన్ లిక్కర్‌లో వాణిజ్య నియంత్రణ) ఆర్డినెన్స్, 2024 (.c. ఆర్డినెన్స్ నం.6ఆఫ్ 2024) తదితర ఆర్డినెన్సుల స్థానంలో రూపొందించబడిన మూడు ముసాయిదా బిల్లులకు రాష్ట్రమంత్ర మండలి ఆమోదం తెలుపుతూ రాష్ట్రశాస సభ ముందుంచేందుకు అనుమతించింది.

-నాసిరకం మద్యంతో గత ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే.. మా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నూతన మద్యం విధానం అమలు చేయడం జరుగుతోంది.

**9.సాధారణపరిపాలనావిభాగం :**

-చిత్తూరు జిల్లా కుప్పం ప్రధాన కేంద్రంగా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (గ్రా) పునరుద్దరణకు మరియు దాని పరిధిలోని (4) మండలాలు మరియు (1) మున్సిపాలిటీ సమగ్ర ఆర్థిక వృద్ధి, అభివృద్ధి, స్థిరమైన అభివృద్ధి సాధిస్తూ పేదరికాన్నినిర్మూలించాలనే లక్ష్యంతో ఇప్పటికే తే.09.07.2024దీన జారీ చేయబడిన ....58, . (.) ఉత్తర్వులను ధృవీకరిస్తూ () రాష్ట్రమంత్ర మండలి ఆమోదం తెలిపింది.

**10.సాధారణపరిపాలనావిభాగం**

-పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికై పిఠాపురం ప్రధాన కేంద్రంగా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (గ్రా) ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

**11.పురపాలకమరియుపట్టణాభివృద్ధిశాఖ:**

-గ్రా సహజ పరిధి అయిన 8,352.69 చ.కి.లను పునరుద్దరించేందుకు 1069.55 చ.కి. సత్తెనపల్లి మున్సిపాలిటీని మరియు పల్నాడు జిల్లాలోని గ్రా పరిధిలోని ఆరు మండలాల్లోని 92 గ్రామాలను మరియు బాపట్ల జిల్లాలోని గ్రా పరిధిలోని 5 మండలాల్లోని 62 గ్రామాలను గ్రా పరిధిలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్రమంత్ర మండలి ఆమోదం తెలిపింది. -ఇటీవల రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునః ప్రారంభించారు..

-ఉద్దండరాయునిపాలెం వద్ద సీఆర్డీఏ భవన పనులు ప్రారంభించారు..

**12.సాంఘికసంక్షేమశాఖ:**

-కోర్సు పూర్తి అయిన వెంటనే విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయాలనే లక్ష్యంతో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల (ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్) చెల్లింపు విధానాన్ని మార్చేందుకై ....76 (.) గ్రా., తేదీ 21.11.2023 ను సవరించేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈనూతన విధానం ద్వారా 2024-25 విద్యాసంవత్సరం నుండి లు కాకుండా ఇతర విద్యార్థులందరికీ సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను (ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్) సంబందిత కళాశాలల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేయడం జరుగుతుంది.

-గత ప్రభుత్వంలో అమలు చేసిన విధానానికి ప్రస్తుత ప్రభుత్వం స్వస్తి పలికింది.

-2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను.. విద్యార్థులకు సంబంధం లేకుండా యాజమాన్యాల అకౌంట్‌లలోకి జమచేయడం జరిగేది.

-గత ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల యాజమాన్యాలు నిర్దేశిత గడువుకు ఫీజుల్ని చెల్లించాల్సిందేనని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొచ్చేవారు.

-ఈ క్రమంలో కొంతమంది విద్యార్థులు ఫీజులు కట్టలేక పరీక్షలు కూడా రాయలేదనే విమర్శలు ఉన్నాయి.

-ఈ ఇబ్బందులన్నింటినీ గమనించిన ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాలేజీ యాజమాన్యాల అకౌంట్‌లలోకే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది.

**13.ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ:**

-కాకినాడ జిల్లా పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా రూ.38,32,37,720/- (నాన్రికవరింగ్వ్యయం రూ.34,00,00,000/- మరియు రికరింగ్ (హెచ్ఆర్) వ్యయంరూ.4,32,37,720/-) అంచనా వ్యయంతో అప్‌గ్రేడ్ చేయడంతో పాటు 66 నూతన పోస్టులనుమంజూరు చేసేందుకు చేసినప్రతిపాదనలకుమంత్రి మండలి ఆమోదం తెలిపింది. -దీని ద్వారా 5-6 లక్షల మందికి ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం జరుగుతుంది.

**14.ఇంధన శాఖ:**

-ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ (సవరణ) చట్టం, 2020 లోని సెక్షన్ 3ని సవరించడానికి ముసాయిదా బిల్లు ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 1990 లో 6 పైసలు ఉన్న ఎలక్ట్రిసిటీ డ్యూటీ ని 2020 లో రూ.1.00 కు పెంచడం జరిగింది. అయితే ప్రైవేటు పెట్టుబడిదారులు ఈ ఎలక్ట్రిసిటీ డ్యూటీ నుండి తప్పించుకునేందుకు కోర్టులకు వెళ్లడం జరిగింది. ఈ క్రమంలో ఎలక్ట్రిసిటీ డ్యూటీ బకాయిలను వసూలు చేసేందుకు ఈముసాయిదా బిల్లును రూపొందించడం జరిగింది.

**15.పరిశ్రమలు మరియు వాణిజ్యం:**

- యొక్క రాష్ట్ర స్థాయి కేటాయింపు కమిటీ సిఫారసుల ప్రకారం (ప్రతి కేసుకు 50 ఎకరాల కంటే తక్కువ), యొక్క కేటాయింపు నియమాల ప్రకారం, తే. 21.10.2024 దీన జరిగిన రాష్ట్ర స్థాయి కేటాయింపు కమిటీ () సమావేశం లో 311 పారిశ్రామిక భూమి కేటాయింపులకై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

-గతంలో జారీ చేయబడిన ....571, రెవెన్యూ (అసైన్‌మెంట్.) విభాగం, తేదీ 14.09.2012 ప్రకారం 50 ఎకరాల వరకు ద్వారా పరిశ్రమల యూనిట్లకు భూమని కేటాయించే విదానాన్ని పునరుద్ధరించేందుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

**16.రవాణా, రహదారులు మరియు భవనాలు:**

-అవుటర్ రింగ్ రోడ్, అమరావతి సిటీ మరియు విజయవాడ తూర్పు బైపాస్ మంజూరు కోసం పరిశీలనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

-రాజధాని అమరావతికి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ను 189 కిలోమీటర్ల పొడవున నిర్మించాలన్నది ప్రతిపాదన.

-ఎక్స్‌ప్రెస్ వేలు, ఎకనమిక్ కారిడార్లు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక పార్కులను ఓఆర్ఆర్‌కు అనుసంధానించనుండడంతో రాజధానికే ప్రధానఆకర్షణగానిలుస్తాయి. -సీఆర్డీఏ పరిధిలోకి సత్తెనపల్లి మున్సిపాలిటీ, పల్నాడు జిల్లాలోని 92 గ్రామాలు, బాపట్ల జిల్లాలోని 62 గ్రామాలను తీసుకురావడం జరుగుతుంది. -ఓఆర్ఆర్ పరిధిలోకి.. బెంగళూరు-విజయవాడ కారిడార్, విజయవాడ-నాగపూర్ కారిడార్, ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-216హెచ్, ఎన్‌హెచ్-544, ఎన్‌హెచ్-541జీ వంటివి అనుసంధానమవుతాయి.


# నాణ్యమైన మద్యం దిశగా నూతన ప్రామాణికాల మేరకు పరీక్షలు

**● ప్రాంతీయ ప్రోబెషనరీ, ఎక్సైజ్ లేబొరేటరీలలో అత్యాధునిక గ్యాస్ క్రోమోటోగ్రఫీ ● బ్లైండ్ పరీక్షకు 9, ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ పరీక్షించడానికి 13 పరిమితులు ● మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకు ఉపకరించేలా ప్రభుత్వ చర్యలు**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : నాణ్యమైన మద్యంను వినియోగదారులకు అందించాలన్న లక్ష్యం మేరకు ప్రభుత్వం నూతనంగా విభిన్న ప్రమాణికాలు మేరకు పరీక్షలు నిర్వహిస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఇప్పటి వరకు కేవలం ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ) నమూనాలను పరీక్షించి అరు రకాల ప్రమాణీకాలను మేరకు పరిశీలించేవారని ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా ఆధునీకరించామన్నారు. ప్రాంతీయ ఎక్సైజ్ లాబొరేటరీలలో ఆరు ప్రాథమిక ప్రమాణీకాలను మేరకు ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ నమూనాలను ఇథైల్ ఆల్కహాల్, అసిడిటీ, ఆల్డిహైడ్స్, మిథనాల్, నీటిలో కలయిక మాత్రమే నిర్వహించేవారన్నారు. మరో వైపు ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ రూపంలో ఉత్పత్తి అయ్యే విస్కీ, బ్రాందీ, వోడ్కా, జిన్, రమ్ లకు సంబంధించి బాటిలింగ్ చేయడానికి ముందు మిశ్రమ నమూనాలలో ఆల్కహాల్ శాతం (స్ట్రెంత్) మాత్రమే లెక్కిస్తున్నారు. ఇలా కేవలం ఒక పరామితి మాత్రమే ఇప్పటి వరకు పరీక్షించబడుతుండగా, ప్రభుత్వ అదేశాల మేరకు ఇప్పుడు ఈ విధానాలలో సమూల మార్పులు తీసుకువచ్చారు. ఆధునిక సాంకేతిక ఆలంబనగా ముందడుగు వేస్తున్నారు. ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, బ్లెండ్ (బాటిలింగ్ కు ముందు సిద్దం చేసిన నమూనా) లను పరీక్షించడానికి గ్యాస్ క్రోమోటోగ్రఫీని విదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని కొల్లు రవీంద్ర వివరించారు. ఇది సాంకేతికంగా ఉన్నతమైన విధానంగా గుర్తింపు పొందింది. వైజాగ్, గుంటూరు, చిత్తూరు, కర్నూలు, కాకినాడలలోని రీజనల్ ప్రోబెషనరీ, ఎక్సైజ్ లేబొరేటరీల ద్వారా బాటిలింగ్ కు ముందు అన్ని రకాల మద్యంను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా వివిధ రకాల ఆల్కహాల్, మద్యం కోసం పరీక్షా పారామితులు విస్తరించామని రాష్ట్ర అబ్కారీ, మద్య నిషేద శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. ఆధునీకరించబడిన పరీక్షలను అనుసరించి ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ) పరీక్షించడానికి పదమూడు 13 పారామితులు సిద్ధం చేసారు. బ్లెండ్ (విస్కీ, బ్రాందీ, వోడ్కా జిన్) పరీక్షించడానికి తొమ్మిది పారామితులు నిర్ణయించారు. నూతన ప్రామాణీకాల అమలు ఫలితంగా కెమికల్ రియాక్షన్ వంటి పరిస్థితులను అడ్డుకోగలుగుతామన్నారు. ఇది మద్యం వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకు ఉపకరిస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.




# ఆంగ్లో-ఇండియన్స్ సమస్యల పరిష్కారానికి కృషి



**● రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ● మంత్రి ఫరూక్‌ను కలిసిన ఏడు రాష్ట్రాల ప్రతినిధుల బృందం**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ఉన్న ఆంగ్లో ఇండియన్స్ కుటుంబాల సంక్షేమానికి, వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ పేషి లో ఆంగ్లో-ఇండియన్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం (ఏపీ తెలంగాణతో సహా 7 రాష్ట్రాలతో కూడినది) మంత్రి ఫరూక్ ను కలిశారు.ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డా.ఎ.రాయ్ రోజారియో, ప్రధాన కార్యదర్శి ఎన్.పాట్రిక్ దూలాండ్, సభ్యులు బార్బరా ఆన్ బెర్బీ, అమలా వాలెస్,నిక్సన్ డి'క్రూజ్, కొరెట్టా అలియాస్ కవిత,కోరిన్ న్యూబెగింగ్ లు మంత్రి ఫరూక్,మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కే హర్షవర్ధన్,ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ ఏ.శేఖర్ ల దృష్టికి ఆంగ్లో ఇండియన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో దాదావు లక్ష దాకా ఆంగ్లో ఇండియన్స్ జనాభా ఉందని, అయితే ఎటువంటి అభివృద్ధికి సంక్షేమానికి నోచుకోలేక పడుతున్న ఇబ్బందులను ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.ఆంగ్లో ఇండియన్స్ కు చట్టసభల్లో ప్రాతినిధ్యానికి కేటాయింపులు, ఉన్నత విద్య అభ్యాసనం, ఉపాధి కోసం రిజర్వేషన్ అమలు,బ్యాంకుల నుంచి రుణాలు అందేలా సరళీకృతమైన విధానాలు తో పాటు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూగత ప్రభుత్వ హయాంలో ఆంగ్లో ఇండియన్స్ కు దక్కాల్సిన సంక్షేమ ఫలాలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో భాగంగా వివిధ సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే చర్యలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం జరిగిందని అన్నారు. ఆంగ్లో ఇండియన్స్ కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలను సీఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం ద్వారా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఫెడరేషన్ ప్రతినిధుల బృందానికి మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.అనంతరం సిక్కుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రి ఫరూక్ ను కలిశారు. ఏపీలో సిక్కుల ఆర్థిక స్వావలంబన, సంక్షేమం కోసం ప్రత్యేకంగా సిక్కుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అండగా నిలవాలని ప్రతినిధులు మంత్రిని కోరారు. సిక్కు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

# మంత్రులకు చంద్రబాబు వార్నింగ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు కేబినెట్ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. చాలామంది మంత్రులకు ఇంకా సీరియస్ నెస్ రాలేదని... కొందరు మంత్రులకు ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని వార్నింగ్ ఇచ్చారు. మెతక వైఖరి విడనాడాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో విమర్శలు ఎదుర్కొన్న కొందరు అధికారులు ఇప్పటికీ తీరు మార్చుకోలేదని... అలాంటి వారి కారణంగా మనం విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని చంద్రబాబు అన్నారు. మరోవైపు కేబినెట్ సమావేశంలో సోషల్ మీడియాలో పోస్టులపై చర్చ జరిగింది. ఈ అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేవనెత్తారు. కొంతమంది వైసీపీ నేతలు పదేపదే పోస్టులు పెడుతున్నారని... వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఫోన్ చేసినా కొందరు ఎస్పీలు స్పందించడం లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ కు అనుకూలంగా పని చేసిన కొందరు పోలీసు అధికారులు ఇప్పటికీ కీలక పోస్టుల్లో ఉన్నారని చెప్పారు. కింది స్థాయిలో ఉన్న డీఎస్పీలు, సీఐలపై నెపం నెట్టి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇళ్లలో ఉన్న మహిళలపై కూడా పోస్టులు పెడుతున్నారని... అందుకే తాను రియాక్ట్ కావాల్సి వచ్చిందని చెప్పారు.

# బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి



అమరావతిః తెలంగాణ నుంచి ఏపీకి బదిలీపై వచ్చిన ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి కాటా.. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టరుగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో ఆమ్రపాలి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఉద్యోగులు.. ఆమ్రపాలిని సత్కరించారు. ఏపీలోని విశాఖపట్నంలో ఆమ్రపాలి జన్మించారు. ఆమ్రపాలి తండ్రి వెంకటరెడ్డి ఆంధ్రా యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ఆచార్యులుగా పనిచేశారు. విశాఖపట్నంలో ప్రాథమిక విధ్యాభ్యాసం పూర్తి చేసిన ఆమ్రపాలి.. చెన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఐఐఎం బెంగళూరులో ఎంబీఏ పూర్తి చేశారు. యూపీఎస్సీ పరీక్షల్లో 39వ ర్యాంక్ సాధించిన ఆమ్రపాలి.. 2010 వ సంవత్సరపు బ్యాచ్ ఐఏఎస్ అధికారి. అలాగే ఐఏఎస్‌కు చిన్న వయసులోనే ఎంపికై ఎందరికో ఆదర్శంగా నిలిచారు. తెలంగాణలో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆమ్రపాలి.. వివిధ హోదాలలో పనిచేశారు. అనంతరం కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆమ్రపాలిని తెలంగాణకు తీసుకువచ్చారు. ఆ తర్వాత తెలంగాణలో పలు హోదాల్లో పనిచేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గానూ వ్యవహరించారు. అయితే ఐఏఎస్‌ల బదిలీపై క్యాట్ ఉత్తర్వుల మేరకు ఆమ్రపాలి సొంతరాష్ట్రమైన ఏపీకి బదిలీ అయ్యారు. క్యాట్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆమ్రపాలి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు కూడా క్యాట్ తీర్పుతో ఏకీభవించింది. దీంతో గత నెలలో ఆమ్రపాలి ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. అనంతరం అక్టోబర్ 27న ఆమ్రపాలిని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ప్రభుత్వం నియమించింది. అలాగే ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో ఇవాళ విజయవాడలోని పర్యాటక సంస్థ కార్యాలయంలో ఆమ్రపాలి కాటా ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన వాణీ ప్రసాద్‌ను కార్మికశాఖ ముఖ్య కార్యదర్శిగా, వాకాటి కరుణను ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా నియమిస్తూ ఏపీ సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

### తిరుమల లడ్డూ వివాదంపై ..

# రంగంలోకి సీబీఐ సిట్, టీమ్


తిరుమలః తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై బిగ్ అప్డేట్ వచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ ప్రారంభించింది. ఈ సిట్‌లో సభ్యులుగా సీబీఐ నుంచి ఎస్పీ వీరేష్ ప్రభు (హైదరాబాద్‌లో ఏజెన్సీ జాయింట్ డైరెక్టర్), మురళీ రంభ (విశాఖపట్నంలోని సీబీఐ ఎస్పీ)లను నియమించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గోపీనాథ్ జెట్టి (డీఐజీ, విశాఖపట్నం రేంజ్)లను సిట్ సభ్యులుగా నియమించింది. అయితే ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ నుంచి సభ్యుడిని ప్రకటించాల్సి ఉంది. సీబీఐ డైరక్టర్ పర్యవేక్షణలో సిట్ బృందం విచారణ చేయనుంది. సిట్ నెయ్యి యొక్క కల్తీ రేటెడ్ నమూనాలపై ప్రయోగశాల నివేదికలను పరిశీలిస్తోంది. యఫ్ యస్ యస్ ఎ ఐ, సెంటర్ ఆఫ్ ఎనాలిసిస్ అండ్ లెర్నింగ్ ఇన్ లైవ్‌స్టాక్ అండ్ ఫుడ్ (%జూూఖీ%) నుండి జూలై నాటి ల్యాబ్ నివేదికలను %ూ×ు% పరిశీలించినట్లు తెలుస్తోంది. గ్రౌండ్ లెవల్ విచారణ కోసం ఈ బృందం త్వరలో తిరుమలకు వచ్చే అవకాశం ఉంది. సిట్‌లో భాగమైన సీబీఐ అధికారులు ఎస్ వీరేష్ ప్రభు (హైదరాబాద్‌లో ఏజెన్సీ జెటి డైరెక్టర్), మురళీ రంభ (విశాఖపట్నంలోని సిబిఐ ఎస్పీ). త్వరలో ఈ బృందం తిరుమలకు రానున్నారు. సుప్రీం కోర్టు అక్టోబర్ 4న ఇద్దరు సీబీఐ అధికారులు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన ఒక అధికారితో కూడిన ఐదుగురు సభ్యుల సిట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణల వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

### మంత్రి నారా లోకేశ్‌ను

# అభినందించిన మంత్రులు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు ఇవాళ ఇతర మంత్రులు అభినందనలు తెలియజేశారు. ఏపీ కేబినెట్ మంత్రులు ఉండవల్లిలోని లోకేశ్ నివాసానికి వచ్చారు. లోకేశ్ ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అమెరికాలో వారం రోజుల పాటు సాగించిన పెట్టుబడుల యాత్రను లోకేశ్ గ్రాండ్ సక్సెస్ చేశారని మంత్రులు కొనియాడారు. ఏపీకి పెట్టుబడులు రాబట్టేందుకు, పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించేందుకు లోకేశ్ అలుపెరుగని కృషి చేశారని అభినందించారు. నారా లోకేశ్ అమెరికా పర్యటనలో వరుస భేటీలతో ఫుల్ బిజీగా గడిపారు. దాదావు 100 కంపెనీల ప్రతినిధులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను వారికి వివరించారు. ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉందని లోకేశ్ వారికి తెలియజేశారు. భారత్ లోనే బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీని ఏపీలో అమలు చేస్తున్నామని వారికి స్పష్టం చేశారు.




# అగ్రరాజ్యాధినేతగా ట్రంప్ అద్భుత విజయం

- డోనల్డ్ ట్రంప్ చరిత్రాత్మక విజయం
- రెండోసారి అధ్యక్షుడిగా శ్వేత సౌధంలోకి..
- అమెరికాకు ఇది 'గోల్డెన్ ఏజ్' అన్న ట్రంప్
- భారత ప్రధాని మోడీ సహా ప్రపంచ దేశాల అభినందనలు
- అపఖ్యాతితో వదిలి వెళ్లిన వైట్ హౌస్‌లోకి సగర్వంగా పునరాగమనం



వాషింగ్టన్: అగ్రరాజ్యం అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. అమెరికాలోని పత్రికలు జరిపిన సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకమని తేల్చినా.. ప్రజలు మాత్రం అండగా నిలిచారు. కొంత విరామంతో ఒక అభ్యర్థి అమెరికా అధ్యక్ష స్థానంపై తిరిగి కూర్చోవడం 131 ఏళ్ల తర్వాత ఇదే. అంతేకాదు.. ఎన్నికలకు ముందు కోర్టు కేసులు ఇబ్బంది పెట్టినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా చివరి వరకూ పోరాడారు. 2016 నాటి ఫలితాలకు భిన్నంగా ఈసారి పాపులర్ ఓటు కూడా ట్రంప్‌కే లభించింది. ఆయనకు దాదాపు 51 శాతానికి పైగా ఓట్లు లభించగా.. హారిస్ 47 శాతం వద్దే ఆగిపోయారు.

## స్వింగ్ మొత్తం ట్రంప్ వైపే..

సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాలను నిలబెట్టుకోవడంతో పాటు.. గంపగుత్తగా స్వింగ్ స్టేట్స్ ఏడింటా ట్రంప్ హవా నడిచింది. ముఖ్యంగా అమెరికాలో ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు, వేతనాలు, అక్రమ చొరబాట్లు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో తిరుగులేని విధంగా ప్రభావాన్ని చూపాయి.

## జార్జియాలో అనుకూల పవనాలు..

అరబ్, ముస్లింలు అధికంగా ఉన్న జార్జియాలో ఈసారి మొదటి నుంచి కమలా హారిస్ వెనుకంజలోనే ఉన్నారు. గతంలో ఇక్కడ బైడెన్ హవా నడిచింది. కానీ, గాజా యుద్ధం విషయంలో డెమోక్రాట్ల వైఖరిపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరిని బుజ్జగించేందుకు కమలా హారిస్ ప్రచారం చివరిలో కూడా తాను గాజాలో శాంతిని నెలకొల్పేందుకు వీలైనంతగా యత్నిస్తానని హామీ ఇచ్చారు. అదేమీ పెద్దగా ఫలితం చూపలేదు. మరో వైపు ట్రంప్ తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో యుద్ధాన్ని ఆపేస్తానని హామీ ఇచ్చారు. దీనికి తోడు ఆయన హయాంలో అఫ్గాన్ యుద్ధాన్ని ఆపడం, మరే కొత్త యుద్ధంలోనూ అమెరికా తలదూర్చకుండా ఉండటం కూడా సానుకూలంగా మారింది.

## వలసల వాదనకు బలమైన మద్దతు..

ట్రంప్ మద్దతుదారులు వలస అంశానికే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ విషయాన్ని ఏపీ ఓట్ కాస్ట్ ప్రజాభిప్రాయ సేకరణ కూడా వెల్లడించింది. వాస్తవానికి ఉత్తర అమెరికాలో అక్రమ వలసదారులు పెద్ద సమస్యగా మారారు. ఈ విషయాన్ని ట్రంప్ బలంగా వాడుకొన్నారు. జార్జియాలోని ప్రచారంలో మాట్లాడుతూ ఏకంగా 1798 నాటి ఎలియన్ ఎనిమీస్ యాక్ట్ను తాను మళ్లీ తెరపైకి తెస్తానని హామీ ఇచ్చారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్, జర్మనీ, ఇటలీ వాసులను కట్టడి చేయడానికి దీనిని వాడేవారు. దీని ప్రకారం అక్రమ వలసదారులు అమెరికన్లను హత్య చేస్తే .. వారికి మరణదండన విధిస్తారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ర్యాలీలో కూడా ఇదే హామీ ఇచ్చారు. అక్రమ వలసల నిరోధంపైనే రిపబ్లికన్లు ఏకంగా 243 మిలియన్ డాలర్లు వెచ్చించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

## యుద్ధ వ్యతిరేకి కావడం..

ట్రంప్ విదేశాంగ విధానంలో యుద్ధాలకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడం ఓటర్లను ఆకర్షించిన అంశం. ఇప్పటికే ఉక్రెయిన్, గాజా యుద్ధాల్లో ఆ దేశం పాత్ర ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా కీవ్ను కాపాడేందుకు బిలియన్ల డాలర్ల సొమ్ము ఇవ్వడం సగటు అమెరికా వాసికి నచ్చలేదు. ట్రంప్ అధికారంలో ఉంటే రష్యాతో సరిగ్గా డీల్ చేసేవారని స్వింగ్ స్టేట్స్లో నిర్వహించిన సర్వేల్లో ఓటర్లు అభిప్రాయపడ్డారంటే పరిస్థితి అర్థమవుతుంది. చైనా విషయంలో బైడెన్ అత్యంత బలహీనంగా కనిపించారు. మరోవైపు గతంలో ఏ నిర్ణయాన్ని అయినా రెండో ఆలోచన లేకుండా స్థిరంగా తీసుకోవడం ట్రంప్నకు స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్ తీసుకొచ్చింది.

## ఆర్థిక వ్యవస్థ కూడా

ట్రంప్ను విజయతీరాలకు చేర్చిన బలమైన అంశాల్లో ఆర్థిక వ్యవస్థ నిర్వహణ కూడా ఒకటి. 2020లో బైడెన్ అధికారం చేపట్టాక తీసుకొన్న నిర్ణయా లతో అమెరికా చాలా కాలం ద్రవ్యోల్బణం కారణంగా ధరల పెరుగు దలతో అవస్థపడింది. అప్పట్లో బైడెనామిక్స్ అంటూ డెమోక్రాట్ల విధానాలను హేళన చేసే పరిస్థితి తలెత్తింది. బైడెన్ పాలసీల కారణంగా తాము అవస్థలు పడ్డామని చాలా మంది ఓటర్లు న్యూయార్క్ టైమ్స్-సియానా కాలేజ్ పోల్లో వెల్లడించారు.

## ఎప్పుడూ ఏటికి ఎదురీతే ట్రంప్ తత్వం

పలు సర్వేలు ఆయనకు వ్యతిరేకంగానే ఫలితాలు వస్తాయని అంచనా వేసినా.. ఎలాంటి నిరుత్సాహానికి గురికాకుండా తనదైన తెంపరితనంతో ప్రచారం చేసిన ట్రంప్.. రెండోసారి అధ్యక్ష పీఠం దక్కించుకొని తన సత్తా చాటారు. పలు సంచలనాలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్గా ఉండే ట్రంప్ అమెరికా ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించి మరోసారి అధ్యక్ష పీఠం అధిరోహించబోతున్నారు. తొలి నుంచీ ఏటికి ఎదురీదే స్వభావంతో తన మనసులో భావాలను విస్పష్టంగా పైకిచెబుతూ ఒంటిచేత్తో అధ్యక్ష పోరులో నెగ్గిన ట్రంప్ వ్యక్తిగత, రాజకీయ విశేషాలు మీకోసం..

## సైనిక అకాడమీలో క్రమశిక్షణతో..

చిన్నప్పటి నుంచీ ట్రంప్ ఏటికి ఎదురేగే మనస్తత్వమే. ఆయన తండ్రి ఫ్రెడ్రిక్ క్రీస్ట్ ఫ్రెడ్ ట్రంప్నకు జర్మనీ మూలాలున్నాయి. తల్లి మేరీ ట్రంప్ స్కాట్లాండ్ వాసి. న్యూయార్క్ నగరం పరిసరాల్లోని క్వీన్స్లో 1946, జూన్ 14న ట్రంప్ జన్మించారు. బాల్యంలో ఆయన చాలా చురుకుగా ఉండేవారు. దీంతో 13ఏళ్ల వయసులోనే ఆయన్ను న్యూయార్క్ సైనిక అకాడమీలో చేర్పించారు. అక్కడే చక్కని క్రమశిక్షణను అలవరుచుకున్నారు. దీంతో ఆయనలో ఆత్మవిశ్వాస స్థాయిలు కూడా పెరిగాయి. సైనిక అకాడమీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన ఫోర్డామ్ వర్సిటీలో రెండేళ్లపాటు చదువుకున్నారు. అనంతరం పెన్సిల్వేనియా వర్సిటీలోని వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ కామర్స్ నుంచి ఆర్థిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. అదే సమయంలో ఆయన తన తాతగారి సంస్థ ఎలిజబెత్ ట్రంప్ అండ్ సన్స్లో వ్యాపార మెలకువలు నేర్చుకున్నారు. అంతేకాదు బుల్లితెరపైనా ట్రంప్ తన దైన ముద్రవేశారు. హోమ్ ఎలోన్ - 2: లాస్ట్ ఇన్ న్యూయార్క్, అక్రాస్ ద సీ ఆఫ్ టైమ్, ద లిటిల్ రాస్కల్స్ లాంటి పలు హాలీవుడ్ చిత్రాల్లోనూ మెరిశారు. అదే సమయంలో ఓ దిగ్గజ వ్యాపార వేత్తగానూ అడుగులేశారు. ఇవానా (1977-92), మార్లా మాప్లెస్ (1993-99)లను ఆయన వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం మూడోభార్య మెలానియాతో జీవిస్తున్నారు. మొత్తం ఆయనకు ఐదుగురు పిల్లలు.

## 1970ల్లోనే రాజకీయాల్లో చక్రం తిప్పాలని..

రూ.వేల కోట్లకు పడగలెత్తిన దిగ్గజ వ్యాపారవేత్తగానే కాదు.. తెంపరితనం కలిగిన అధ్యక్షుడిగానూ ట్రంప్ అందరికీ సుపరిచితులు. రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ఆలోచన 1970లలోనే ట్రంప్ బుర్రను తొలిచింది. రిపబ్లికన్ నేత, మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్కు ఆయన గట్టిమద్దతుదారు. 1987లో తాను రిపబ్లికన్ నేతగా ట్రంపే స్వయంగా ప్రకటించుకున్నారు. 1988లో రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష పోటీదారుగా ట్రంప్కు మంచి అవకాశాలున్నాయని పత్రికలు కూడా విశ్లేషించాయి. అయితే, కొన్ని అంతర్గ విభేదాలు, మనస్పర్థలతో ఆయన అప్పుడు పోటీకి దిగలేదు. అయితే 1999లో ఆయన రిఫార్మ్ పార్టీకి మారారు. అందులోనే దాదాపు మూడేళ్లు కొనసాగారు. అప్పుడే ఆయన అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో నిలబడతారని ప్రచారం జరిగింది. అయితే అంతర్గత విభేదాల వల్ల ఆయన పార్టీ వీడిపోయారు. అనంతరం డెమోక్రటిక్ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా ఆయన్ను కీలక పదవులేమీ వరించలేదు. ఈ క్రమంలో 2008లో ఆయన పార్టీని వీడినట్లు వార్తలు వినిపించాయి. అయితే 2009లో రిపబ్లికన్ అభ్యర్థి జాన్ మెక్ కెయిన్కు ఆయన బహిరంగంగా మద్దతు ప్రకటించారు. అప్పుడే, ఆయన రిపబ్లికన్ పార్టీలోకి మళ్లీ అడుగుపెట్టినట్లు స్పష్టమైంది. అయితే డిసెంబరు 2011 డిసెంబరులో తాను స్వతంత్ర అభ్యర్థినని ఆయన ప్రకటించారు. ఐదు నెలల తర్వాత మళ్లీ రిపబ్లికన్ పార్టీ తలుపుతట్టారు. అటు రిపబ్లికన్, ఇటు డెమోక్రటిక్ రెండు పార్టీలకూ ఆయన భూరి విరాళాలు ఇచ్చేవారు. గతంలో పలుసార్లు వివిధ పార్టీల తరపున అధ్యక్ష రేసులో ట్రంప్ దిగుదామనుకున్నారు. 2006, 2014ల్లో న్యూయార్క్ గవర్నర్గానూ పోటీ చేద్దామనుకున్నారట.

### గ్రామీణ ప్రాంతాల్లో పట్టు..

ట్రంప్నకు అమెరికాలోని గ్రామీణ ఓటర్ల నుంచి బలమైన మద్దతు ఉంది. సర్వేలు ఎన్ని చెప్పినా అయోవా వంటి రాష్ట్రాల్లో ఆయనే విజయం సాధించడానికి ఇదే కారణంగా నిలిచింది. ఇక జార్జియా, కెంటకీ, నార్త్ కరోలినాల్లో ఇదే ఆయనకు ఆధిక్యం తీసుకొచ్చింది.

## ప్రతికూలతల్ని తట్టుకొని.. గెలుపును ముద్దాడి..

ఈ క్రమంలోనే 2016 అధ్యక్ష ఎన్నికల్లో బరిలోకి దిగిన ట్రంప్ను ప్రతికూల పవనాలు ఉక్కిరిబిక్కిరి చేసినా తట్టుకొని నిలబడి విజయం సాధించారు. ఈసారి కూడా పలు డిబేట్లలో ప్రత్యర్థి కమలా హారిస్ ఆయన్ను ఇరకాటంలో పెట్టినా.. ట్రంప్ మాత్రం తనదైన తెంపరి మాటలతో, వ్యక్తిగత వ్యాఖ్యలతో ఆమెను టార్గెట్ చేస్తూ ప్రచారంలో దూసుకెళ్లారు. అమెరికాను తిరిగి గొప్ప దేశంగా మార్చడం, అక్రమ వలసలను నియంత్రించడం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం, యుద్ధాలకు దూరంగా ఉండాలనడం, ఆర్థిక వ్యవస్థ పునర్ నిర్మాణం.. ఇలా అనేక అంశాలపై ప్రజలకు హామీలు ఇచ్చి వారిని ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు.

అంతేకాదు, 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ చేతిలో ఓటమిపాలైన తర్వాత ట్రంప్ అరెస్టు కావడంతో పాటు పలు అభియోగాలు, కేసులు సైతం ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈసారి గెలవాలన్న భారీ లక్ష్యంతో అవిశ్రాంతంగా శ్రమించిన ట్రంప్ను విజయం పలకరించింది. అయితే, కమలా హారిస్ పలు కీలక డిబెట్లలో వివిధ అంశాలపై ఆయన్ను ఇరకాటంలో నెట్టడంతో డెమోక్రాట్లదే విజయం అనే చర్చ కూడా నడిచింది. కానీ, ట్రంప్పై కాల్పులు జరగడంతో పరిస్థితిలో చాలా మార్పు వచ్చిందనే చెప్పాలి. దీనికి తోడు ట్రంప్ ఇచ్చిన హామీలూ చాలా వరకు ప్రభావం చూపడంతో పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, నార్త్ కరోలినా వంటి స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్ కింగ్గా నిలిచారు.





## అధ్యక్షుడికే సకల సదుపాయాలు.. వేతనం, ఇతర సౌకర్యాలు ఇలా..

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన వారికి సకల సౌకర్యాలూ లభిస్తాయి. వేతనం, భద్రత, సకల సౌకర్యాలతో కూడిన భవనాలు ఉంటాయి. ˇకల సౌకర్యాలతో కూడిన శ్వేత సౌధం, వేతనం, 24/7 ఈగ కూడా వాలకుండా చూసుకునే భద్రతా సిబ్బంది ఉం టారు. అమెరికా అధ్యక్షుడికి వార్షికంగా 4 లక్షల డాలర్ల వేతనం అందుతుంది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం రూ.3.3 కోట్లు అన్నమాట. ఈ మొత్తాన్ని అమెరికా కాంగ్రెస్ 2001లో నిర్ణయించింది. అప్పటి నుంచి ఈ మొత్తంలో ఎలాంటి మార్పూ లేదు. సింగపూర్ ప్రధాని అందుకునే 16 లక్షల డాలర్లలో ఇది నాలుగో వంతు మాత్రమే! అమెరికా అధ్యక్షుడిగా రిటైరయ్యాక వార్షికంగా 2 లక్షల డాలర్లు లభిస్తుం ది. 1 లక్ష డాలర్లు అలవెన్సు రూపంలో లభిస్తుంది. అమెరికా అధ్యక్షుడికి వేతనంతో వ్యక్తిగత, అధికారిక ఖర్చుల కోసం ఏటా వేతనంతో పాటు 50 వేల డాలర్లు పన్ను రహిత వేతనం అందుతుంది. ప్రయాణ ఖర్చుల కోసం మరో లక్ష డాలర్లు, వినోదం కోసం మరో 19 వేల డాలర్లు అందుతుంది. ఈ మొత్తాలన్నీ కలిపితే ఏటా అధ్యక్షుడికి లభించేది 5.69 లక్షల డాలర్ల పైమాటే. అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టడానికి ముందు డెకరేట్ చేయడానికి మరో లక్ష డాలర్లు కూడా చెల్లిస్తారు.

శ్వేత సౌధం కాకుండా.. బ్లెయిర్ హౌస్ అనే అతిథి గృహం ఉంటుంది. ఇది శ్వేతసౌధం కంటే పెద్దగా 70వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో 119 గదులు, అతిథుల కోసం 20 బెడ్రూములు, 35 బాత్రూమ్లు, 4 డైనింగ్ హాల్స్, జిమ్, సెలూన్ వంటివి ఉన్నాయి.ఇవి కాకుండా క్యాంప్ డేవిడ్ అనే పర్వత విడిది కేంద్రం కూడా ఉంటుంది. మేరీల్యాండ్ రాష్ట్రంలో 128 ఎకరాల విస్తీర్ణంలో ఉంది.

ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ నుంచి ప్రతి అధ్యక్షుడు దీన్ని వినియోగిస్తున్నారు. దౌత్యపరమైన చర్చల కోసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇజ్రాయెల్, ఈజిప్టుల మధ్య ఒప్పందం ఇక్కడే జరిగింది. అందుకే ఆ ఒప్పందాన్ని క్యాంప్ డేవిడ్ ఒప్పందంగా పరిగణిస్తారు. అమెరికా అధ్యక్షుడు ప్రయాణించడానికి ఉన్న ప్రత్యేక విమానం ఎయిర్ఫోర్స్ వన్ విమానం. ఇందులో సకల సౌకర్యాలూ ఉంటాయి. గాల్లో ఉండగానే ఇంధనాన్ని నింపుకొనే సామర్థ్యం దీని సొంతం. ఓ విధంగా ఎగిరే శ్వేతసౌధంగా దీన్ని పిలుస్తారు. అధ్యక్షుడికి సేవలందించడానికి మెరైన్ వన్ పేరుతో హెలికాప్టర్ ఉంటుంది. ఇది గంటకు 241 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. భారీ పేలుళ్లను తట్టుకొనేలా దీనికి బాలిస్టిక్ ఆర్మర్ ఉంది. క్షిపణి హెచ్చరిక వ్యవస్థతో పాటు.. క్షిపణి రక్షణ వ్యవస్థ ఉంది. మూడు ఇంజిన్లలో ఒకటి విఫలమైనా ఎగరగలదు. ఒకేలాంటివి ఐదు హెలికాప్టర్లు ఉంటాయి. ఎందులో అధ్యక్షుడు ఉన్నాడో శత్రువులకు తెలియకుండా చేయడం కోసం వీటిని వాడతారు.

ప్రపంచంలోనే అత్యంత భద్రమైన కారును అమెరికా అధ్యక్షుడి ప్రయాణానికి వినియోగిస్తారు. దీన్ని 'బీస్ట్'గా వ్యవహరిస్తారు. అధునాతన ఫీచర్లతో, భారీ భద్రతా ప్రమాణాలతో ఈ కారును తయారుచేశారు. అధ్యక్షుడు ఏ దేశానికి వెళ్లినా బీస్ట్ అక్కడ అడుగుపెట్టాల్సిందే. అమెరికా అధ్యక్షుడితో పాటు వారి కుటుంబ సభ్యులకు 24/7 సీక్రెట్ సర్వీస్ భద్రత ఉంటుంది.



# ఇండియన్ అమెరికన్ల హవా..

## ఆరుకు పెరిగిన 'సమోసా కాకస్'

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో ఇండియన్ అమెరికన్లు తమ హవా చూపించారు. గతంతో పోల్చుకుంటే మెరుగైన ప్రదర్శన చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాల్లో ఇండియన్ అమెరికన్లు జోరు చూపించారు. ప్రతినిధుల సభ కు ఆరుగురు ఎన్నికయ్యారు. గతంలో ఆ సంఖ్య ఐదుగాఉండేది. శ్రీ తానేదార్, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, డాక్టర్ అమిబెరా, ప్రమీలా జయపాల్ మరోసారి విజయం దక్కించుకున్నారు. వారితో పాటు న్యాయవాది అయిన సుహాస్ సుబ్రహ్మణ్యం వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ పార్టీ తరపున గెలుపొందారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మైక్ క్లాన్సీపై విజయం సాధించారు. ఈ సరికొత్త విజయంతో సమోసా కాకస్ (ప్రతినిధుల సభ, సెనెట్కు ప్రాతినిధ్యం వహించే ఇండియన్ అమెరికన్ల గ్రూప్)లో సభ్యుల సంఖ్య ఆరుకు చేరింది.కాలిఫోర్నియాలోని 6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డాక్టర్ అమిబెరా మరోసారి బరిలో నిలిచి, ఏడోసారి విజయం సాధించారు. 59 ఏళ్ల అమి 2013 నుంచి ఈ స్థానంలో విజయం సాధిస్తున్నారు.ఇక భారత సంతతికి చెందిన మరో నేత రాజా కృష్ణమూర్తి హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్లో విజయం సాధించారు. ఇల్లినోయి 8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ఆయన డెమోక్రటిక్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రత్యర్థి మార్క్ రిక్ను ఓడించారు. 2016లో తొలిసారి ఆయన అక్కడినుంచి ప్రతినిధుల సభకు వెళ్లారు.వాషింగ్టన్ రాష్ట్రంలోని 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ప్రమీలా జయపాల్ గెలుపొందారు. 2017 నుంచి ఆమె ఈ స్థానాన్ని నిలబెట్టుకొంటూ వస్తున్నారు. 59 ఏళ్ల ఆమె డెమోక్రటిక్ పార్టీలో శక్తిమంతమైన నేతగా ఇప్పటికే ఎదిగారు.కాలిఫోర్నియాలోని 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి రో ఖన్నా పోటీలో నిలిచారు. 2016 నుంచి కొనసాగుతోన్న ఆయన విజయాల పరంపర ఈసారి కొనసాగింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి అనితా చెన్నై విజయం సాధించారు.మిషిగన్లోని 13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా తానేదార్ పోటీ పడ్డారు. ఆయనకు ఇది వరుసగా రెండో విజయం. ఇల్లినోయా, కాలిఫోర్నియా, మిషిగన్ మూడూ డెమోక్రాట్లకు పట్టున్న రాష్ట్రాలే. అరిజోనా స్టేట్ అసెంబ్లీలో వరుసగా 2018, 20, 22ల్లో విజయం సాధించిన డాక్టర్ అమిష్ షా ఈసారి ప్రతినిధుల సభ బరిలోకి దిగారు.

DBS

**వేలం ప్రకటన**

మా బ్యాంక్ యొక్క దిగువ పేర్కొన్న జ్యువెల్ లోన్ కస్టమర్‌లు మా రిమైండర్‌లు మరియు రిజిస్టర్డ్ అడ్రస్ కారణంగా రసీదుతో కూడిన రిజిస్టర్ చేసిన పోస్ట్‌ను ఇప్పటికే వారికి పంపిన తర్వాత కూడా వారి రుణ ఖాతాలను సెటిల్ చేయడంలో విఫలమయ్యారని సమాచారం.
పూర్తి రుణ మొత్తాన్ని **15.11.2024**న లేదా అంతకు ముందు సెటిల్ చేయకపోతే, కస్టమర్ తాకట్టు పెట్టిన సెక్యూరిటీలు **15.11.2024న ఉదయం 11.00 గంటలకు** లేదా బ్యాంకుకు అనుకూలమైన మరేదైనా తేదీకి వేలం ద్వారా విక్రయించబడతాయి.తదుపరి నోటీసు లేకుండా మరియు బ్యాంక్ ప్రాంగణంలో లేదా ఈ-వేలం ప్లాట్‌ఫారమ్‌లో బహిరంగ వేలం విక్రయం ద్వారా బ్యాంక్ యొక్క పూర్తి సంతృప్తి కోసం. https://egold.auctiontiger.net

| Ref. No. | కస్టమర్ పేరు | బ్రాంచ్ పేరు | స్థూల ఆదాయం | నికర ఆదాయం |
|---|---|---|---|---|
| 28936439 | షేక్ ఫతీమున్నీసా | గవర్నర్‌పేట్, విజయవాడ | 39.20 | 32.50 |
| 56937474 | అమానుల్లా పఠాన్ | పెదపులిపాక | 22.60 | 19.60 |
| 56933785 | షేక్ మస్తాన్ వలీ | పెదపులిపాక | 23.10 | 21.05 |
| 56937481 | షేక్ అల్లాభక్షు | పెదపులిపాక | 38.05 | 34.25 |
| 56937573 | షేక్ ఛాన్‌భాషా | పెదపులిపాక | 29.70 | 27.40 |
| 56937566 | షేక్ ఛాన్‌భాషా | పెదపులిపాక | 10.80 | 8.80 |
| 69632670 | నటరాజ్ వుక్కం | సుల్తాన్నాగరం గొల్లపాలెం | 7.90 | 7.50 |
| 75433837 | చిగురుపల్లి నాగరాజు | తాడేపల్లి | 12.40 | 11.40 |

తేది : 05.11.2024
స్థలం : చెన్నై

అధీకృత అధికారి
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్

* DBS బ్యాంక్ ఇండియా లిమిటెడ్ అనేది DBS బ్యాంక్ లిమిటెడ్ సింగపూర్ నుండి పూర్తి లైసెన్స్ క్రింద అనుబంధ సంస్థ

సూర్య
విజయవాడ
గురువారం
7 నవంబర్ 2024



# సంపాదకీయం

suryaeditpage@gmail.com

మరోసారి సుప్రీంకోర్టు అత్యంత న్యాయ, ధర్మబద్ధమైన పంథాలో ముందుకెళ్లి అన్ని ప్రైవేట్ ఆస్తుల స్వాధీనానికి రాష్ట్రాలకు అధికారం లేదని ఓ చరిత్రాత్మిక తీర్పుకు అంకురార్పణ గావించడం ఎంతైనా హర్షణీ యం. ఈ సందర్భంగా జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సారథ్యంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు 7 - 2 మెజారిటీతో ఓ సంచలనాత్మక తీర్పుకు తెరలేపినట్లయింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అన్ని ప్రైవేట్ ఆస్తుల మీద హక్కులు ఉండబోవు అని, సమాజ హితం,ఉమ్మడి ప్రయోజనాలు, సామాజిక పంపకం నిమిత్తమై ఏ ప్రైవేట్ ఆస్తినైనా స్వాధీనం చేసుకునేందుకు వారికి అధికారం లేదు అని సుప్రీంకోర్టు వారు తమదైనా శైలిలో పూసకు గుచ్చి నట్లు వివరించారు. ఇందులో భాగంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి ) ఆధారంగా ప్రైవేట్ యాజమాన్యం లోని అన్ని వనరులను స్వాధీనం చేసుకునే హక్కు రాష్ట్రాలకు లేదని వారు చాలా క్లుప్తంగా, పారదర్శకంగా తమ తీర్పును వెలువరించారు. దీంతో గతంలో ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్

## సుప్రీం తీర్పు చరిత్రాత్మికం

కృష్ణయ్యర్, జస్టిస్ చిన్నపురెడ్డి తదితరులు ఇచ్చిన గత తీర్పులతో ప్రస్తుత సీజేఐ వారు తీవ్రంగా విబేదించడంతో పాటు వాటిలో వెల్లిబుచ్చిన అభిప్రాయాలను లోపభూయిష్టమైనవిగా, తప్పుల తడకగా,కాలదోషం పట్టినవిగా పేర్కొని ఈ సందర్భంగా వారు అయా తీర్పులను కొట్టేశారు. అంతేకాదు ఆర్థిక ప్రజాస్వామ్యానికి కూడా రాజ్యాంగం అనుమతులను ఇస్తుందంటూ అత్యంత అమూల్యమైన వ్యాఖ్యలు సుప్రీంకోర్టు వారు చేయడాన్ని బట్టి ఈ స్ఫూర్తిదాయక, ఆదర్శ తీర్పు ఎంతటి ప్రాధాన్యత, ప్రాముఖ్యతను సంతరించుకున్నదో మనం ఇట్టే ఊహించవచ్చు. అయితే సుప్రీం కోర్టు వారు తమ తీర్పులో ఒక అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అదేమంటే ఆర్టికల్ 39 ( బి ) లో పేర్కొన్న సామాజిక వనరులు,సమాజహితం పరిధిలోకి వస్తాయని,అయా నిర్దిష్ట అవసరాల నిమిత్తమై వాటిని ప్రభుత్వం స్వాదీనం చేసుకోవచ్చని ' సీజేఐ ' స్పష్టం చేసింది. ఈ మేరకు సీజేఐతో పాటు జస్టిస్ హృషికేష్ రాయ్,జస్టిస్ జె.వి. పార్తీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా,జస్టిస్ రాజేష్ బిందాల్, జస్టిస్ నితీష్ చంద్ర శర్మ,జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీ వీరందరి తరపున సీజేఐ దాదాపు 199 పేజీల తీర్పును వెలువరించడం అనేది దేశవ్యాప్తంగా ఒక అతి పెద్ద సంచలనానికి కారణభూతమైంది. అయితే ఈ సందర్భంగా ప్రస్తుత సీజేఐ ఒకటి తలిస్తే మరో ఇద్దరు జస్టిస్ బి.వి. నాగరత్న పాక్షికంగా జస్టిస్ సుధాన్షు మరొకటి తలుస్తూ వారు ఇచ్చిన ఈ తుది,అంతిమ తీర్పును విబేదించడం కూడా దేశవాప్తంగా ఒక అతి పెద్ద దుమరాన్ని లేపింది,ఓ కోసమెరుపుగా నిలిచింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదిఏమైన ఆర్టికల్ 39 ( బి ) కింద కేవలం ప్రైవేట్ ఆస్తులను కూడా సామాజిక వనరులుగా భావించవచ్చా అన్న అంశం దాదాపు 1992 నుంచి న్యాయస్థానల్లో నలుగుతున్న నేపథ్యంలో,దీనికి సంబంధించి ఈ పాటికే 16 పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్ లో వున్న గందరగోళ పరిస్థితుల్లో,దీనికి సంబంధించి 2002లో తొమ్మిది మంది సభ్యులు సుప్రీంకోర్టు ధర్మాసనానికి నివేదించారు. అయితే ఎట్టకేలకు 2024లో సీజేఐ చంద్రచూడ్ ధర్మాసనం దీని విచారణకు నడుం బిగించి అందులో భాగంగా ప్రైవేట్ ఆస్తులన్నింటిని సామాజిక వనరులుగా భావించడానికి వీలులేదని సీజేఐ తన స్ఫూర్తిదాయక తీర్పులో స్పష్టం చేసిన తీరు సుప్రీంకోర్టు వారి వివేకం,పరిణతిని చాలా గొప్పగా చాటిచెబుతున్నది అనే మాట సత్య దూరం కాదు. ఏమైనా గతంలో ప్రైవేట్ ఆస్తులను సామాజిక హితం కోసం స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొన్న తీర్పు సామ్యవాద ధోరణితో కూడినదని ప్రస్తుత సీజేఐ వారు అభిప్రాయపడ్డారు. అదే సమయం స్పెక్ట్రమ్, ఎయిర్ వేవ్స్,సహజ వాయువు, గనులు,ఖనిజాల వంటి కొరతతో కూడిన పరిమిత వనరులు కొన్ని సార్లు ప్రైవేట్ అజమాయి-షీలో ఉండేందుకు ఆస్కారం వుంది కనుక పంపకం అనే మాటకు అర్థం విశృతమైనదని సీజేఐ వారు పేర్కొన్నారు. న్యాయం మరో పది కాలాల పాటు ఇలాగే వర్ధిల్లేలా,అన్యాయానికి చరమగీతం పాడేలా తీర్పులు వెలువడితే కనుక ఈ ప్రజాస్వామ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా అత్యంత తేజోవంతంగా వర్ధిల్లడం తథ్యం!జై హింద్!

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# చైతన్యంతోనే బిసిలకు రాజ్యాధికారం

■ బిసి లకుచట్ట సభల్లో 50 శాతం సీట్లు రిజర్వ్ చేయాలి ■ రాజకీయ పదవుల పంపిణీ న్యాయం అందని ద్రాక్షే ■ నేటికీ ప్రాతినిధ్యం దక్కని కులాలెన్నో? ■ ఎన్నికల్లో విజయం సాధించటానికి ధన ప్రభావం పెరిగింది ■ అగ్రవర్ణ కుల ఆధి పత్య ప్రభావం నిమ్నకులాలపై పడుతోంది

నేదునూరి కనకయ్య
9440245771



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సం"రాలౌతున్నప్పటికి జనాభాలో 50శాతం వున్న బి 'సి లకు రాజ్యాధికారంలో వాటా పొందక పోవడం వల్ల బి 'సి లకు సామాజిక 'ఆర్థిక రాజకీయ 'పంపిణీ న్యాయం అందని ద్రాక్షే అయింది. కొంత మంది స్వార్థ పూరిత నాయకులు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం వల్ల బి'సిలు సామాజికంగా రాజకీయంగా 'విద్య 'ఉద్యోగ రంగాల్లో వెనుకబడి పోయారు. ప్రజాస్వామ్య లౌకిక భారత్ లో సమాన అవకాశాలు అందుకోలేక పోయారు. బి'సిలకు రాజ్యాధికారం' బి'సిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు' బీ'సీల వాటా బి' 'సీ లకే బీ'సీ కులగణన అనే పదాలు వాటిపై చర్చలు సర్వ సాధారణ మైనాయి. జాతీయ రాజకీయ పార్టీలు మేధావులు మీడియా రచయితలు సామాజిక వేత్తలు బీ'సీ సంఘాల నాయకులు ప్రైవేటు 'ప్రభుత్వ రంగ సంస్థ ల్లో పనిచేసే వారు 78 సం " రాలుగా చర్చిస్తూనే వున్నారు. వికసిత భారత్ అంటూ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మనదేశ ప్రతిపక్ష నాయకులు రాజీవ్ గాంధీ బీ'సీ డిక్లరేషన్ తో భవిష్యత్తు భారత దేశంలో' బీ'సీ సమాజం కీలక పాత్ర వహిస్తుందని పేర్కొనడం గమనార్హం.

ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంలో ప్రభుత్వాలు పాలకులు బి' సి లకు స్వల్పకాలిక పథకాలు ప్రకటించి ఆశించిన మేరకు నిధులు కేటాయించక ఆశల పల్లకి లోకి తోచి అయోమయ విషవలయంలోకి నెట్టి వేసే సంస్కృతి రాజ్యమేలుతుంది. బిసిల పట్ల ప్రభుత్వాలు సంతుస్టీకరణ జిమిక్కులని ప్రదర్శించి మభ్యపెట్టే వాగ్దానాలతో ఓటు బ్యాంకుగా వాడుకునే సంస్కృతి నెలకొన్నది. రాజకీయ పార్టీలు ఎన్నికలప్పుడే బి 'సి జపం చేస్తూ సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభల్లో పోటీ చేయడానికి టిక్కెట్లు కేటాయింపులో బి'సిల పట్ల వివక్ష పాటించడం వల్ల ఎం 'బి 'సి లు 'కులవృత్తి' చేతి వృత్తి దారులు ( కుమ్మర" కమ్మరి' ఉప్పరి 'సగర లాంటి కులాలు చట్ట సభల్లో ప్రవేశం చలేదు. ఎన్నికల సమయంలో పాలక పార్టీలు ప్రతిపక్ష పార్టీలు బి'సి సాధికారితపై ఇచ్చినమాటలు నీటిమూటలైనాయి. సార్వత్రిక ఎన్నికల్లో లోకసభ' అసెంబ్లీఅభ్యర్థులుగాబి'సిలకు టికెట్లు నిరాకరించడం పాలక పార్టీ 'ప్రతి పక్ష పార్టీల రాజకీయ విధానమైంది. గెలుపు గుర్రాల పేరున జాతీయ'ప్రాంతీయ'ఉపప్రాంతీయ పార్టీలు ధనస్వాములకు' స్కాం వీరులకు'మాఫియా' డాన్లకు 'రియల్ వ్యాపారులకు 'పెట్టుబడి దారులకు ' వ్యాపార 'వాణిజ్య వేత్తలకు 'కార్పొరేట్ వేత్తలకు నేరచరితులకు టికెట్ల కెటాయింపులో పోటీ పడటం వల్ల రాజకీయ రంగం అవినీతి మయమైంది . రాజకీయాల్లో బి 'సి లు అంటరాని వారుగ పరిగణించే ధోరణులు ప్రభలడం పట్ల సామాజిక ఆర్థికవేత్తలు వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఎన్నికల్లో విజయం సాధించటానికి ధన ప్రభావం అగ్రవర్ణ కుల ప్రభావంగీటు రాయికావడం బి'సి ల రాజ్యాధికార ప్రవేశానికి నిరోధకంగా పరిణమించడం గమనార్హం. దేశ జనాభాలో 10 శాతాని కంటె తక్కువ వున్న అగ్రకులాల వారు చట్టసభల్లో ప్రవేశించి రాజ్యాధికారం చెలాయిస్తున్నారు. జనాభాలో దాదాపు 56 శాతం వున్న బి 'సిలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారు.

చట్టసభల్లో ' స్థానిక సంస్థల్లో బి'సి'లకు రేజర్వేషన్స్ సామాజిక అనివార్యత. బీ'సీ హక్కుల కోసం బి'సిల పోరాటం ప్రారంభమైంది. బీ'సీ గర్జన పేరుతో బి'సిల రాజ్యాధికార అవసరాన్ని గుర్తించే శాతానికి పెంచాలన్న డిమాండ్ ఊపందుకుంది.

బీ'సీలు రాజ్యాధికారం ద్వారా మాత్రమే ప్రజల జీవితాలలో మార్పులు వస్తుందని. మేధావుల అభిప్రాయం. దేశంలో కొన్ని దశాబ్దాలుగా రాజ్యాధికారం కొన్ని వర్గాల చేతిలో వుండటం వల్ల ఆర్థిక అసమానతలు రాజ్యమేలుతున్నాయి.

కాకా కాలేకేర్ కమిటీ 'మండల కమిటీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అనంతరామన్ కమిషన్' మురళీధర్ రావు కమిషన్' తెలంగాణ తొలి బీ'సీ కమిషన్ చైర్మన్ 'బి 'ఎస్' రాములు కమిషన్ తెలంగాణ రాష్ట్రంలో. బీ'సీ ల వెనుకబడిన తనం విధ్య' ఉద్యోగ 'ఉపాధి రాజకీయరంగాల్లో బి'సిలు వెనకబడి వున్నారని తెలియజేశాయి.'

నేడు దేశంలో బీ'సీ ల చైతన్యం కొత్త మలుపు తిరిగింది. బీ'సీ లు ఇన్నాళ్లు పనివాళ్ళుగానే వున్నారు. పాలించే వారిగా ఎదుగలేక పొయ్యారు. బీ'సీలు అడుక్కునే స్థాయి నుండి అడగడం వరకు ఎదిగారు. బీ'సీ ల్లో ఎన్ని కులాలు ఉన్న బీ'సీ ఎజెండాగా బీ'సీలు ఓటుబ్యాంకుగా మరాలి. బి'సి లు సంఘటిత శక్తిగా ఎదుగాలి. బి'సిల ఐక్యత ఓటుబ్యాంకు రూపంలో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై నిశ్శబ్ద విప్లవంగా మారాలి. జనాభాలో 56 శాతంపైగా వున్న బి 'సిలు ఎం'పి ఎమ్మెల్యే 'ఎమ్మెల్సీ ' ముఖ్య మంత్రి 'ప్రధాన మంత్రి గా ఉన్నపుడు మాత్రమే బి'సిల జీవితాలలో వెలుగులు వస్తాయి. రాజ్యాధికారంలో అందరికి సమాన అవకాశాలు కల్పించాలి. ప్రతిభ ఆధారంగా బి'సిలను ప్రొతాహిస్తే వికసిత భారత్ లక్ష్యం నెరవేరి భారత్ ప్రపంచానికి దిక్సూచి అవుతుంది. బి'సిలుకనీస వసతులు లేక దారిద్ర్య రేఖ కింద జీవిస్తున్నారు విధ్య' వైద్య సౌకర్యాలు 'అవస్థాపన సౌకర్యాలు అందుబాటులో లేక పేదరికం 'నిరుద్యోగం నిరక్షరాస్యత 'అల్ప పౌష్ఠికాహారం' అనారోగ్యం సమస్యల్లో కొట్టు మిట్టాడుతున్నారు. ప్రజాస్వామ్య దేశంలో అన్ని కులాల వారికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం ప్రజాస్వామిక ప్రాతినిధ్య వాటా కల్పించాలి. దేశంలో స్వేచ్ఛా' సమానత్వం సౌభ్రాతృత్వం సమాన అవకాశాలు అందరికీ కలిపించినప్పుడే సామాజిక న్యాయం' సామాజిక సమానత్వం 'సమైక్యత సమగ్రత ' ఆర్థిక సమానత్వం సౌభ్రాతృత్వం శాంతి నెలకొంటుంది.

'బి' సి ల ప్రాతినిధ్యంలి దేశంలో బి'సి లకు రాజ్యాంగబద్ధమైన హక్కులు రాజకీయ హక్కులు భద్రత రక్షణ కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ప్రకారం 78 ఏళ్ల స్వాతంత్ర భారత్ లో రాజకీయ రంగంలో బి'సి ల ప్రాతినిధ్యం14 శాతం దాట లేదని వెల్లడించింది.

కేంద్రమంత్రి వర్గంలో'రాష్ట్ర మంత్రివర్గంలో' లోక సభ రాజ్యసభ' రాష్ట్ర 'అసెంబ్లీలో కౌన్సిల్లో ' బి' సి ల ప్రాతినిధ్యంపై జరిగిన సర్వే లో ఆసక్తి కరమైన అంశాలు వెళ్ళడైనాయి. దేశ జనాభాలో 56 శాతం వున్న బి'సి లకు రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం 14 శాతం మించక పోవటం వల్ల బి' సిల సంక్షేమం అభివృద్ధి ఆశించిన మేరకు జరుగలేదు. 78 యేళ్ల ప్రజాస్వామ్య గణతంత్ర భారత్ లో రాజ్యాంగ లక్ష్యాలైన సామాజిక 'ఆర్థిక రాజకీయ పంపిణీ న్యాయం బి 'సిలకు జరుగలేదు. ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్స్ ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు అన్ని రంగాల్లో బి'సిలకు అన్యాయం జరిగడం శోచనీయం

రాజ్యాంగంలో చట్ట సభలకు ఎస్సీ' ఎస్టీ లకు రిజర్వేషన్స్ ప్రవేశ పెట్టి దేశ జనాభాలో 56 శాతం వున్న బి'సి లకు చట్టసభల్లో సీట్లు రిజర్వేషన్స్ ప్రవేశ పెట్టక అణిచివేశారు.

దేశంలో ఉద్యోగ రంగంలో బి 'సి ల వాటా 9 శాతం' పారిశ్రామిక రంగంలో బి 'సి వాటా 1 శాతం మాత్రమే వుంది. ప్రైవేట్ రంగం సామాజిక ఆర్థిక రాజకీయ 'వైద్య :విద్య రంగాలలో సమగ్ర వికాసం కోసం కృషి చేస్తూ వుంటే మన దేశంలో పీడిత కులాలను అణిచివేయాలని చూడడం రాజ్యాధికారానికి దూరంగా ఉంచడం వల్ల రాజ్యాంగ లక్ష్యాలైన "అందరికీ విధ్య" "అందరికీ వైద్యం" "అందరికీ "ఉపాధి అనేది అందని ద్రాక్షగా మారింది.

కేంద్ర ప్రభుత్వం 78 ఏళ్ల స్వాతంత్ర కాలంలో దేశ జనాభాలో 56 శాతం వున్న బి' సి ల సామాజిక 'ఆర్థిక' రాజకీయ. విధ్య' వైద్య రంగాలలో శాస్త్ర సాంకేతిక 'వ్యాపార వాణిజ్య ఉద్యోగ రంగాల్లో సాధించిన ప్రగతి పురోగతి మీద అన్ని రంగాలలో బి 'సి లు ఎదుర్కొంటున్న సమస్యల మీద బి 'సిల అభివృధి సంక్షేమం కొరకు అమలైన చట్టాల పలితాల పట్ల సామాజిక వేత్తలు ఆర్థిక వేత్తలు పాలనావేత్తలు న్యాయ నిపుణులతో అధ్యయన కమిటీ వేసి బి 'సి ల సాధికారిత .పట్ల సమగ్ర అధ్యయనం చేయాలి .బి 'సి ల జనాభా గణన కులాల వారిగా జనాభా గణన చేసి కులాల వారిగా పథకాలు రూపొందించాలి బి 'సి లకు సబ్ ప్లాన్ అమలు చెయ్యాలి . బీ' సీ ల జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలి. లోకసభ 'రాజ్య సభ 'రాష్ట్ర అసెంబ్లీలో' కౌన్సిల్ ల్లో బి' సి లకు సీట్లు రిజర్వ్. చేస్తూ పార్లమెంట్లో బిల్లు ప్రవేశ పెట్టాలి.

78ఏళ్ల లొ చట్టసభ ల్లోకి ప్రవేశించని కులాలకు(కుమ్మర' కమ్మరి' ఉప్పర 'సగర లాంటి సంచార జాతి ) రాజకీయ ప్రాతినిధ్యం కలిపించాలి. జనాభా లో బి.సి ల వాటా ఎంతో రాజ్యాధికారం లోఅంతే వాటా ఇవ్వాలి.

రిజర్వేషన్స్ కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటు కేంద్ర రాష్ట్ర 'ఉమ్మడి జాబితా' స్థానిక సంస్థల పరిపాలన విధానాల మీద నిపుణులచేత శిక్షణా తరగతులు నిర్వహించిరాజ్యాంగం పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి.

పరిపాలన సామర్థ్యం మాకే ఉందిమేము మాత్రమే పాలించగలం అని అంటున్న అగ్రకులాల నాయకులకు బీ' సీ'లు పాలనలో ప్రతిభలో తక్కువ కాదని చాట వలసిన అవసరం ఆసన్నమైంది.

పార్టీలకు అతీతంగా బీ'సీలు ఐక్యం కావాలి. ప్రజాస్వామ్య శాంతి యుత పద్ధతిలో బీ'సీలు రాజ్యాధికార సాధన కొరకు ఉద్యమించాలి. మేము ఎంతో మా వాటా అంత అంటూ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో మనదేశ భవిష్యత్తును మార్చాలి. రాజ్యాంగ లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజిక న్యాయ సాధనలో బి'సిలు ముందుకు సాగాలి. దశాబ్దాలుగా రాజ్యాధికారానికి దూరంగా ఉన్న బీ'సీలు ఐక్యం కావడం వల్ల రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలను అందిపుచ్చుకోవడమే కాని అగ్రవర్ణాలకు వ్యతీ రేకం కాదు. భవిష్యత్తు తరాలకు బంగారు భవిష్యత్తు అందించాలంటే బీ'సీల్లో ఐక్యత 'చైతన్యం వెల్లివిరియాలి. బలపడాలి.

కేంద్ర ప్రభుత్వం జనాభాలో 56 శాతం వున్న బి'సి' లకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలి .56 శాతం జనాభా వున్న బి 'సి:లకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించటానికి రాజ్యాంగాన్ని సవరించాలి. పార్లమెంట్లో బీ' సీ బిల్లు ప్రవేశ పెట్టి బి 'సి ల రాజ్యాధికార సాధనకు ఉపక్రమించాలి. బి'సిల అభివృద్ధే దేశాభివృద్ధి దిశగాప్రభుత్వంకార్యాచరణతో సంక్షేమ భారత్ నిర్మాణానికి సమాయాత్తం కావాలని ఆశిద్దాం.

# ఈవీటోల్ గగనతల ప్రయాణంతో ట్రాఫిక్ సమస్యలకు చెక్

యేచన్ చంద్ర శేఖర్
8885050822

■ "ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ ల్యాండింగ్" లతో కొత్త అనుభవం ■ మానవ జీవితంలో వేగం పెంచిన విప్లవాత్మక సాంకేతికాభివృద్ధి ■ గంటల తరబడి ప్రయాణం నిమిషాలలోకి రావటం ఖాయం ■ ప్రయాణ వేగంతో కలసి వచ్చే ఖర్చులు ■ ఇక ఎక్కువ ఎత్తైన భవనాలపై హెలిప్యాడ్లు "తప్పని సరి"

మొదట్లో ఎడ్ల బండ్ల మీద మొదలైన మానవుని ప్రయాణం మారు తున్న కాలం మరియు జీవనశైలికి అనుగుణంగా ఎన్నో మార్పులకు లోనయ్యింది. అలా అందుబాటులోకి వచ్చిన సైకిళ్ళు, మోటార్ సైకిళ్ళు, కార్లు, బస్సులు, రైళ్ళు, ఓడలు, విమానాలు లాంటి వివిధ రకాల రవాణా సాధనాలు నేడు మానవ జీవితంలో అంతర్భాగమ య్యాయి. భూమండలంపై సంచరించే ఈ వాహనాలకు తోడుగా మానవుడు చంద్రమండలం మరియు ఇతర గ్రహాలపై మానవ మనుగడకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు రాకెట్లను సైతం సృష్టించాడు. ఈ విప్లవాత్మక సాంకేతికాభివృద్ధి కారణంగా మానవ జీవితంలో వేగం పెరిగిపోవడంతో ఒకప్పుడు అధికంగా ప్రజా రవాణాపై ఆధారపడ్డ సామాన్య ప్రజలు సైతం వ్యక్తిగత వాహనాల వైపు మొగ్గు చూపడంతో పల్లెలు, పట్టణాలతో సంబంధం లేకుండా రహదార్లపై విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. ప్రత్యేకించి జనసమ్మర్దంగా ఉండే నగరాలు మరియు పట్టణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉండే ప్రజా రవాణాకు తోడుగా నానాటికీ పెరిగిపోతున్న వ్యక్తిగత వాహానాల కారణంగా కొద్దిపాటి దూరం ప్రయాణించాలన్నా చాలా సమయం పడుతోంది. జటిలమైన ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జనసమ్మర్దం అధికంగా ఉండే బెంగళూరులో అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు "ఎయిర్ ట్యాక్సీలు" ప్రవేశ పెట్టేందుకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ మరియు బెంగళూరుకు చెందిన సరళ ఏవియేషన్ సంస్థలు ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే అత్యంత జనసమ్మర్దంగా ఉండే బెంగళూరు నగరంలోని ఏ ప్రాంతం నుండైనా కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత తక్కువ సమయంలో చేరుకోవచ్చు.

తొలుత బెంగళూరులో ప్రవేశపెట్టనున్న సరళ ఏవియేషన్ యొక్క "ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ మరియు ల్యాండింగ్" -ఈవీటోల్ ఎయిర్క్రాఫ్ట్ పట్టణ ప్రాంత రవాణాలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తుందని భావిస్తున్నారు. రోడ్డు మార్గం ద్వారా బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఎలక్ట్రానిక్స్ సిటీకి చేరుకోవడానికి 152 నిమిషాలు సమయం పడితే, ప్రతిపాదిత ఈవీటోల్ ద్వారా రూ. 1,700 ఖర్చుతో కేవలం 19 నిమిషాల సమయం పడుతుంది. ఈ తరహా రవాణా వ్యవవస్థ సాధారణంగా శిలాజ ఇంధనాలతో అధిక మొత్తంలో కాలుష్యాన్ని వెదజల్లే ఇతర వాహనాలతో పోలిస్తే అత్యంత పర్యావరణ అనుకూలమైనవి. ఈవీటోల్ ను చిన్న పట్టణ ప్రయాణాలు, కార్గో డెలివరీలు మరియు అత్యవసర వైద్య సేవలకు కూడా ఉపయోగించవచ్చు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడ్డ ఈ విమానాల నిర్వహణ వ్యయం కూడా తక్కువగా ఉండడంతో పట్టణ ప్రాంత ప్రయాణానికి ఇవి విశ్వసనీయ ప్రత్యామ్నాయాలుగా ఉపయోగపడతాయి. ఈవీటోల్ సేవల కోసం మౌలిక సదుపాయాలు మరియు కార్యాచరణ నమూనాలను అభివృద్ధి చేయడానికి సరళ ఏవియేషన్ మరియు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్ లు సంయుక్తంగా పనిచేస్తున్నాయి. గగనతలం ద్వారా పట్టణ ప్రాంతాల్లో ప్రయాణానికి సంబంధించి నిబంధనలను అభివృద్ధి చేయడానికి ఈ సంస్థ భారతదేశ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ మరియు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తో కలిసి పని చేస్తోంది. సరళ ఏవియేషన్ ప్రకారం, ఎలక్ట్రిక్ పవర్ తో ఏడుగురు ప్రయాణించేందుకు అనుకూలంగా ఉండే ఈవీటోల్ ద్వారా నగరం నుండి బెంగళూరు విమానాశ్రయానికి ఒకటిన్నర గంటల ప్రయాణాన్ని కేవలం ఐదు నిమిషాలకు తగ్గించవచ్చు. అన్నీ అనుకున్నట్లు జరిగితే, బెంగళూరు సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సిబిడి) నుండి దాదాపు 40 కి.మీ. దూరంలో ఉండే కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రోడ్డు మార్గంలోని ట్రాఫిక్ చిక్కులతో సంబంధం లేకుండా సునాయాసంగా చేరుకోవచ్చు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే మొట్టమొదటి ఈవీటోల్ -స్నేహపూర్వక విమానాశ్రయం. ఈవీటోల్ కు సాధారణ విమానాల లాగా రన్ వే అవసరం లేదు. హెలికాప్టర్ లాగా నిట్ట నిలువుగా టేకాఫ్ మరియు ల్యాండింగ్ కావడం ఈవీటోల్ యొక్క మరొక ప్రత్యేకత.

కంపెనీ వెబ్సైట్ లో పొందుపరిచిన సమాచారం ప్రకారం, ఏకధాటిగా 160 కిలోమీటర్ల దూరం ప్రయాణించగల ఈవీటోల్ విమానం నగరాలు మరియు పట్టణ పరిధిలో 20 నుండి 40 కిలోమీటర్ల ప్రయాణానికి అనుకూలంగా రూపొందించబడింది. తాము తొలుత ప్రారంభించ సంకల్పించిన బెంగుళూరు, ముంబై మరియు ఢిల్లీ వంటి నగరాల్లో ఈవీటోల్ ద్వారా ప్రయాణించే వారు సాధారణ రోడ్డు మార్గం ప్రయాణంతో పోలిస్తే దాదాపు 87 శాతం వరకు సమయం ఆదా చేస్తారని ఆశించవచ్చు అని పేర్కొంది. నాలుగు, డబుల్-ఐసోలేటెడ్ బ్యాటరీ ప్యాక్లతో అమర్చబడిన ఈవీటోల్ 250 కి.మీ.ల వేగాన్ని అందుకునేందుకు ఏడు ఎలక్ట్రిక్ మోటార్లకు శక్తినిస్తుంది. ఇది ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈవీటోల్ విమానం సీటింగ్ ఒక పైలట్ మరియు ఆరుగురు ప్రయాణీకులకు వారి లగేజీతో సహా సౌకర్యవంతంగా ప్రయాణించేలా నిర్మించబడింది. ప్రతి ట్రిప్పు మధ్య కేవలం 15 నిమిషాల ఛార్జింగ్ సమయంతో ఇది వెంట వెంటనే 40 కి.మీ. ప్రయాణించగలదు. తమ ఈవీటోల్ హెలికాప్టర్ కంటే వంద రెట్లు సురక్షితమైనదని, సాధారణంగా హెలికాప్టర్లలో మోటారు మరియు రోటర్ మధ్య 100 సింగిల్ పాయింట్ల వైఫల్యం ఉంటుంది కానీ తమ విమానంలో అందుకు ఏమాత్రం అవకాశం లేదని, తమ విమానంలో ఏడు ప్రొపెల్లర్లు కలిగి ఉండడంతో ఒకటి విఫలమైనప్పటికీ మిగిలిన వాటితో ప్రయాణం సురక్షితంగా కొనసాగుతుందని సరళా ఏవియేషన్ సహ వ్యవస్థాపకుడు అడ్రియన్ ష్మిత్ పేర్కొన్నారు. ముఖ్యంగా నగరాలు మరియు పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం మరియు మరింత సమర్థవంతమైన రవాణా నెట్వర్కును సృష్టించడం కోసం ఈవీటోల్ ఒక చక్కటి పరిష్కారంగా అందుబాటులోకి రానుంది. ప్రత్యేకించి త్వరితగతిన విమానాశ్రయానికి చేరుకోవాలనుకునే వారికి ఇది అత్యంత సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నగరాలు పట్టణ రద్దీ, కాలుష్యం మరియు ఉద్గారాలను తగ్గించేందుకు జీరో-ఎమిషన్ ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీల ద్వారా వినూత్న రవాణా పరిష్కారాలను అన్వేషిస్తున్న కీలక సమయంలో ఈవీటోల్ ఆవిష్కరణ ఒక గొప్ప ముందడుగుగా భావించవచ్చు. పట్టణ ప్రాంతాల్లో గగనతల ప్రయాణం (అర్బన్ ఎయిర్ మొబిలిటీ) ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంది. కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రారంభమవనున్న ఈ చొరవ భారతదేశంలోని ఇతర నగరాలకు ఒక దిక్సూచిగానే కాక విద్యుత్ విమానయానాన్ని విస్తృతపరచేందుకు మార్గం సుగమం చేస్తుంది. దేశంలో మొట్టమొదట కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రారంభం కాబోయే ఈవీటోల్ రవాణా వ్యవస్థ దేశవ్యాప్తంగా పట్టణ చలనశీలతను విప్లవాత్మకంగా మార్చగల మొత్తం పర్యావరణ వ్యవస్థకు పునాది వేయడంతో పాటు దేశంలో విమానయాన భవిష్యత్తును సమూలంగా మార్చివేయనుంది. ప్రధాన భారతీయ నగరాల్లో, ప్రధాన ప్రాంతం నుండి విమానాశ్రయాల దూరం సాధారణంగా 10 నుండి 20 కిలోమీటర్ల మధ్య ఉంటుంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నగర నడిబొడ్డు నుండి 16 కి.మీ., ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం 20 కి.మీ., హైదరాబాద్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దాదాపు 15 కి.మీ., బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 30 కి.మీ., కోల్కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం 15 కి.మీ. మరియు కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయం 15 కి.మీ., దూరంలో ఉన్నాయి. బెంగళూరు కేంద్రంగా స్థాపించబడిన ఈ సంస్థకు శివం చౌహాన్, రాకేశ్ గాంకర్ మరియు అడ్రియన్ ష్మిత్ లు సహ వ్యవస్థాపకులు. వీరిలో శివమ్ చౌహాన్ కు అమెరికాలోని కాలిఫోర్నియాలో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ మరియు ల్యాండింగ్ ఎయిర్క్రాఫ్ట్ అభివృద్ధి చేసే జాబీ ఏవియేషన్లో పనిచేసిన అనుభవం ఉంది. రాకేష్ గాంకర్ వీటోల్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విద్యుచ్ఛక్తితో నడిచే వ్యక్తిగత జెట్ విమానాన్ని అభివృద్ధిచేసిన జర్మనీలోని లిలియం ఎన్ వి అనే కంపెనీలో పని చేయగా అడ్రియన్ ష్మిత్ సరళ ఏవియేషన్ సహ వ్యవస్థాపకుడు మరియు ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఈఓ). సరళ ఏవియేషన్ తన కార్యకలాపాలను ఐక్యరాజ్యసమితి నిర్దేశిత సుస్థిర అభివృద్ధి లక్ష్యాలైన సరసమైన మరియు స్వచ్ఛమైన శక్తి, స్థిరమైన నగరాలు మరియు సంఘాల అభివృద్ధి కోసం నిర్వహిస్తోంది. 1936లో 21 సంవత్సరాల వయస్సులో పైలట్ లైసెన్స్ పొందిన మొదటి భారతీయ మహిళ, "సరళా థక్రాల్" గౌరవార్థం తమ సంస్థకు ఆమె పేరును పెట్టుకుంది "సరళా ఏవియేషన్ లిమిటెడ్".



60 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తైన భవనాలపై హెలిప్యాడ్లు "తప్పని సరి" అనే కర్నాటక ప్రభుత్వం యొక్క భవన నిబంధనలు బెంగళూరు నగరంలో ఎయిర్ టాక్సీ సేవల అమలు కోసం తక్షణమే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయమని ష్మిత్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల నుండి అందుతున్న సహకారంతో, రెండు లేదా మూడు సంవత్సరాలలో ఎయిర్ టాక్సీ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు.

● బాధితుడికి 25 లక్షల పరిహారం చెల్లించాలి ● కూల్చివేతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశం ● జస్టిస్ డీవై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ

# నోటీసు ఇవ్వకుండా కూల్చివేతపై సుప్రీంకోర్టు ఆగ్రహం



ఢిల్లీ: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చివేయడమేంటని సంబంధిత అధికారులను ప్రశ్నించింది. బాధితుడికి రూ. 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ల ఆదేశాలు జారీ చేసింది. 2019లో రోడ్డు విస్తరణలో భాగంగా మహారాజ్గంజ్ నివాసి మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్ ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఇంటిని ఖాళీ చేయమంటూ అతడికి ఎలాంటి నోటీసులను పంపించకుండానే ఈ చర్యలకు ఉపక్రమించారు. తనకు న్యాయం చేయమని కోరుతూ బాధితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. నాడు దాఖలైన పిటిషన్పై తాజాగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

**ఇది అన్యాయం:** అధికారుల చర్యపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు ఇవ్వకుండా సౌండ్ స్పీకర్ ద్వారా ఇంటిని ఖాళీ చేయమని చెప్పడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. అధికారుల చర్య అన్యాయమంటూ మండిపడింది. బాధితుడికి నష్టపరిహారంగా రూ. 25 లక్షలను అందించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించింది.

కూల్చివేతకు కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై విచారణ జరపడంతో పాటు వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

### పేద విద్యార్థులకు కేంద్రం శుభవార్త

# విద్యాలక్ష్మి పథకం కింద రూ.7.50లక్షల వరకు రుణం

● కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు ● పీఎం విద్యాలక్ష్మితో 22 లక్షల మందికి లబ్ధి ● రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి వర్తింపు ● డబ్బు లేని కారణంతో ఎవరూ చదువుకు దూరం కాకూడదనే పథకం ఉద్దేశం ● 75శాతం రుణం బ్యాంకులకు గ్యారంటీ ఇవ్వనున్న కేంద్రం ● కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



ఢిల్లీ: పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం మోడీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. పీఎం- విద్యాలక్ష్మి పథకంతో పాటు పలు అంశాలకు ఆమోదం తెలిపింది. పేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం సులభంగా రుణాలు పొందేందుకు విద్యాలక్ష్మి పథకానికి కేబినేట్ ఆమోదముద్ర వేసింది. డబ్బు లేని కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకు దూరం కావద్దనే పీఎం-విద్యాలక్ష్మి పథకం ఉద్దేశం. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు పీఎం-విద్యాలక్ష్మి ద్వారా ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఇక సులభంగా రుణాలు పొందుకోవచ్చు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ లో తీసుకున్న నిర్ణయాలను... సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రతి సంవత్సరం 22 లక్షలమంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. దేశంలో 860 విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో పీఎం విద్యాలక్ష్మి పథకం ద్వారా రూ.7.50లక్షల వరకూ రుణం లభించనుంది. ఈ రుణంలో 75 శాతం రుణం వరకూ కేంద్రప్రభుత్వం బ్యాంకులకు గ్యారంటీ ఇవ్వనుంది. రూ.8 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుంది. అలాగే రూ.10 లక్షల వరకూ ఉన్న రుణాలపై 3శాతం వడ్డీ రాయితీ లభించనుంది. యువత నాణ్యమైన విద్య అభ్యసించేందుకు పీఎం విద్యాలక్ష్మి పథకం తోడ్పడుతుంది. ప్రముఖ విద్యా నాణ్యత కలిగిన 860ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించనుంది. రూ. ఏడున్నర లక్షల వరకు రుణ సౌకర్యం అందించనుంది. ఈ పథకం ద్వారా 75 శాతం క్రెడిట్ గ్యారెంటీని కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుంది. పీఎం-విద్యాలక్ష్మి ద్వారా ఏటా 22 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి పొందనున్నారు. అలాగే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు రూ.10,700 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ కేటాయింపునకు ఆమోదం తెలిపింది. అలాగే.. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు రూ.10,700 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ కేటాయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఎఫ్ సీఐ ఆపరేషన్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. 2004-14 సంవత్సరాలతో పోల్చితే.. 2014-2024 సంవత్సరాల మధ్య రైతులకు 4 రెట్లు అధికంగా ఆహార సబ్సిడీ అందిందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఎఫ్సీఐ ఆపరేషన్ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

# విభజన రాజకీయాలను తిప్పి కొట్టండి


● వాయనాడ్ ప్రజలకు ప్రియాంక గాంధీ పిలుపు ● ఉప ఎన్నికల ప్రచారంలో ప్రియాంకాగాంధీ బిజీబిజీ
● పోక్కొట్టుంపడంలో బహిరంగ సభలో ప్రసంగించిన ప్రియాంక గాంధీ



తిరువనంతపురం : వాయనాడ్ లోక్సభ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగిన కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ బిజీబిజీగా ప్రచారం చేస్తున్నారు. పోలింగ్ కు ముందుగానే.. ప్రచారంలో ఆధిక్యం చాటుకునేందుకు అంది వచ్చిన అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా ఇవాళ పోక్కొట్టుంపడంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే నాయకులనే ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. రాజకీయ ప్రతినిధులు ప్రజలకు సేవకులుగా సేవలు అందించాలని, ప్రజాస్వామ్యంలో ప్రజలదే అధికారమని అన్నారు. ప్రస్తుతం దేశాన్ని ప్రతికూల శక్తి ఊడ్చేస్తున్నదని, కానీ కావాల్సింది సానుకూలత, పురోగతి అని ప్రియాంకా గాంధీ వాద్రా చెప్పారు. సరైన పద్ధతిలో పనిచేస్తే వాయనాడ్ను ప్రపంచ టూరిజం డెస్టినేషన్గా మార్చవచ్చని, అందుకు అవసరమైన సామర్థ్యాలన్నీ వాయనాడ్కు ఉన్నాయని ఆమె అన్నారు. వాయనాడ్లో ఉన్నంత అందమైన సహజ వనరులు ప్రపంచంలో మరెక్కడా లేవని వ్యాఖ్యానించారు. సరైన రాజకీయాలతో వాయనాడ్ను వరల్డ్ క్లాస్ టూరిస్టు సెంటర్గా మార్చవచ్చన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ తీరుపై కూడా ప్రియాంకాగాంధీ విమర్శలు గుప్పించారు. నోట్ల రద్దు ద్వారా కేంద్రం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని వాద్రా గుర్తుచేశారు. కొవిడ్ టైమ్లో కూడా కేంద్రం సరైన రీతిలో పనిచేయలేదని, దాంతో ఎందరో చిరు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోయారని వ్యాఖ్యానించారు. కేంద్రం తీరుతో కూలీలు, దుకాణదారులు, రెస్టారెంట్ ఓనర్లు హోటల్ యజమానులు, రైతులు అందరూ ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

# మహారాష్ట్రలో ఎన్సీపీ మ్యానిఫెస్టో విడుదల

● 100 రోజుల్లో కొత్త మహారాష్ట్ర విజన్ ● గ్రామీణ ప్రాంతాల్లో 2.5 మిలియన్ల ఉద్యోగాలు ● మహిళలకు సాయం రూ.1500 నుంచి రూ.2100కు పెంపు ● వరి రైతులకు హెక్టారుకు 25వేల బోనస్



ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ మ్యానిఫెస్టో విడుదల చేసింది. బారామతిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే కొత్త మహారాష్ట్ర విజన్ను అందజేస్తామని అజిత్ పవార్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వ్యవసాయ సదుపాయాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సునీల్ తట్కరే ముంబయిలో, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ గోండియాలో మ్యానిఫెస్టోను విడివిడిగా ఆవిష్కరించారు.

**మ్యానిఫెస్టోలోని ముఖ్య అంశాలు:** గ్రామీణ ప్రాంతాల్లో 2.5 మిలియన్ల ఉద్యోగాల కల్పన. లడ్కీ బహిన్ పథకం నెలవారీ సాయం రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు. వరి రైతులకు హెక్టారుకు 25వేల బోనస్. వృద్ధాప్య పింఛను రూ.1,500 నుంచి రూ.2,100కు పెంపు. షెత్కారీ సన్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.15,000. గ్రామీణ ప్రాంతాల్లో 45,000 'పనంద్' రోడ్ల నిర్మాణం. అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు రూ.15,000 నెలవారీ జీతం. సౌర, పునరుత్పాదక ఇంధనానికి ప్రాధాన్యత, విద్యుత్తు బిల్లుల్లో 30 శాతం తగ్గింపు. 288 మంది శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం భాజపా, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ)లతో కూడిన ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి ప్రయత్నిస్తోంది.

# ఝార్ఖండ్లో జేఎంఎం కూటమి మేనిఫెస్టో విడుదల

● 10 లక్షల ఉద్యోగాలు.. ● రూ.15 లక్షలతో ఆరోగ్య బీమా ● గ్యాస్ సిలిండర్ రూ.450,




రాంచీ: జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి మేనిఫెస్టో విడుదల చేసింది. జార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ-ఎం కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను ప్రకటించింది. రాంచీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం హేమంత్ సోరెన్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఏడు హామీలతో ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశారు. మేనిఫెస్టోలో ప్రధానంగా 10 లక్షల ఉద్యోగాలు, రూ.15 లక్షలతో ఆరోగ్య బీమా కవరేజీ వాగ్దానాలతో కూడిన మేనిఫెస్టో మంగళవారం విడుదల చేసింది. ఈ హామీలను 'న్యాయ్ పాత్ర' పేరుతో విడుదల చేశారు.

**హామీలు ఇవే:** ఆహార భద్రతకు హామీ.. ప్రతి వ్యక్తికి నెలకు 7 కిలోల రేషన్, గ్యాస్ సిలిండర్ రూ.450, మహిళలకు నెలకు రూ.2,500 గౌరవ వేతనం, ఎస్టీలకు 28శాతం, ఎస్సీలకు 12శాతం, బీసీలకు 27శాతం రిజర్వేషన్లు, యువతకు 10 లక్షల ఉద్యోగాలు, పేదలకు రూ.15 లక్షల వరకు ఆరోగ్య బీమా, అన్ని బ్లాకుల్లో డిగ్రీ కళాశాలలు నిర్మాణం జిల్లా కేంద్రంలో ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు, వరిపై ఎంఎస్పీని రూ.3,200కి పెంచనున్నారు. ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై కనీస మద్దతు ధర 50శాతం పెరుగుతుంది, 1932-ఆధారిత ఖతియాన్లో స్థానికత విధానం అమలు చేయబడుతుంది

సర్న ధర్మ కోడ్ అమలులోకి వస్తుంది. 81 మంది సభ్యుల జార?ండ్ అసెంబ్లీకి రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 13, 20 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు మాత్రం నవంబర్ 23న విడుదల కానున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్.. జార?ండ్ ముక్తి మోర్చా (%జేవీవీ%) 30 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ 25, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకున్నాయి.

# ఆర్టికల్ 370 పునరుద్ధరణపై చర్చలు జరపాలి

● జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం ● హోదాను పునరుద్ధరించే తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి
● తీవ్రంగా వ్యతిరేకించి.. తీర్మానం ప్రతులు చించేసిన బీజేపీ సభ్యులు



శ్రీనగర్: జమ్ముకశ్మీర్కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. 2019 ఆగస్ట్ 5న జమ్ముకశ్మీర్కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించే తీర్మానాన్ని జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టారు. 'జమ్ముకశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను కాపాడే ప్రత్యేక హోదా, రాజ్యాంగ హామీ ప్రాముఖ్యతను ఈ శాసనసభ పునరుద్ఘాటిస్తుంది. ఏకపక్ష తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ ఐక్యత, జమ్ముకశ్మీర్ ప్రజల ఆకాంక్షలు రెండింటినీ కాపాడాలి. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి' అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు, సభలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. 'దేశంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయం (పార్లమెంట్) ఈ చట్టాన్ని ఆమోదించింది' అని ఆయన అన్నారు. ఈ తీర్మానం ప్రతులను బీజేపీ సభ్యులు చించారు. పేపర్ ముక్కలను వెల్లోకి విసిరారు. లంగేట్ ఎమ్మెల్యే షేక్ ఖుర్షీద్ వెల్ లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. అయితే ఈ గందరగోళం మధ్య స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. అసెంబ్లీలోని మెజారిటీ సభ్యులు దీనికి మద్దతిచ్చారు. దీంతో ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. గందరగోళం కొనసాగడంతో 15 నిమిషాల పాటు సభ వాయిదా పడింది.

# గడియారం గుర్తుపై సుప్రీం డెడ్ లైన్

● 36గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వాలని అజిత్ పవార్కు ఆదేశం ● అజిత్ పవార్ వర్గానికి కేటాయించడాన్ని సవాల్ చేసిన శరద్ పవార్ ● గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఉల్లంఘించారని పిటిషన్ ● నోటీసులు జారీ ● విచారణ 13కు వాయిదా



ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)కి సుప్రీంకోర్టు డెడ్లైన్ ఇచ్చింది. ఎన్నికల్లో 'గడియారం' గుర్తు వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. అయితే ఈ వివాదం ఇంకా కోర్టు పరిశీలనలో ఉన్నట్లుగా 36 గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. అజిత్ పవార్ వర్గానికి గడియారం గుర్తును ఎన్నికల కమిషన్ (ఈసీ) కేటాయించడాన్ని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ-ఎస్పీ వర్గం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను అజిత్ పవార్ వర్గం ఉల్లంఘించిందని, వివాదంపై స్పష్టత ఇవ్వకుండా గడియారం గుర్తు వినియోగాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ వర్గానికి కొత్త ఎన్నికల గుర్తు కేటాయించాలని బుధవారం సుప్రీంకోర్టులో మళ్లీ వాదించింది. కాగా, న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇరు వర్గాల వాదనలు విన్నది. అజిత్ పవార్ వర్గం తమ ఆదేశాలను పాటించలేదని బెంచ్ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆయన వర్గానికి డెడ్లైన్ విధించింది. 'గడియారం' గుర్తు వివాదం ఇంకా సుప్రీంకోర్టు పరిశీలనలో ఉందంటూ 36 గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. 'మరాఠీ, హిందీ, ఇంగ్లిష్ వార్తాపత్రికల్లో పబ్లిక్ నోటీసులు జారీ చేసి కోర్టుకు చూపించాలని పేర్కొంది. 'గడియారం' గుర్తును అజిత్ పవార్ వర్గం వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను నవంబర్ 13కు వాయిదా వేసింది. అయితే నవంబర్ 20న ఒకే దశలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

# లోకా యుక్త ఎదుట హాజరైన సిద్ధరామయ్య

● రెండు గంటలపాటు విచారణ ● ముగ్గురు ఆఫీసర్లు ఇంటరాగేట్ చేసినట్లు సమాచారం ● అవసరమైతే మరోసారి విచారించే అవకాశం
● ముడా భూముల కుంభకోణంలో సీఎంతోపాటు.. ఆయన భార్యపై కేసు



బెంగళూరు: మైసూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కుంభకోణం కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య బుధవారం లోకాయుక్త ఎదుట హాజరయ్యారు. రెండు గంటల పాటు ఆయనను అధికారులు విచారించారు. సుమారు ముగ్గురు ఆఫీసర్లు ఇంటరాగేట్ చేసినట్టు తెలుస్తోంది. విచారణలో భాగంగా సిద్ధరామయ్య ఎలాంటి పత్రాలను అందించలేదు. అవసరమైతే మరోసారి విచారించనున్నట్టు సమాచారం. కాగా, ముడా కుంభకోణం కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, మరికొందరిపై కేసు నమోదైంది. పార్వతికి 14 స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడినట్టు లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల సిద్ధరామయ్యకు నోటీసులు జారీ చేయగా ఆయన విచారణకు హాజరయ్యారు. ముడా కేసులో లోకాయుక్త పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానం చెప్పినట్టు సీఎం సిద్ధరామయ్య తెలిపారు. వారు ప్రతిదీ రికార్డు చేశారని, అనంతరం నాకు చూపించారని చెప్పారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, జనతాదళ్ సెక్యులర్ పార్టీలు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా తాను ఏమీ చేయలేదని స్పష్టం చేశారు. మరోసారి విచారణ ఉంటుందా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. మళ్లీ విచారణ ఉంటుందా లేదా తనకు తెలియదని అధికారులు కూడా ఏం చెప్పలేదని వెల్లడించారు.

# బెంగళూరులో రిషి సునక్ సందడి

● భార్య, అత్తమామలతో కలిసి సామాన్యుడిలా రిషి సునక్,
●రాఘవేంద్రస్వామి మఠంలో రాయల దర్శనం.. పూజలు
● కార్తీక మాసం సందర్భంగా దీపాలు వెలిగించిన రిషి సునక్ దంపతులు
● తన పిల్లలకు భారతీయ సంప్రదాయాలే అలవాటు చేస్తున్న రిషి సునక్



బెంగళూరు: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్, ఆయన సతీమణి అక్షతా మూర్తి బెంగళూరులోని జయనగర్లోని నంజనగూడులో ఉన్న శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాన్ని సందర్శించారు. రాయల దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, ఆయన భార్య సుధామూర్తి కూడా పాల్గొన్నారు. నవంబర్ 5వ తేదీ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మఠానికి చేరుకున్న రుషి సునక్ దంపతులు అరగంట సేపు మఠంలో గడిపారు. తీర్థ ప్రసాదాలు తీసుకుని రాయల వారి ఆశీస్సులు పొందారు. కార్తీక మాసం సందర్భంగా రాయల సన్నిధిలో దీపాలు వెలిగించారు. భారత సంతతికి చెందిన రిషి సునక్ భారతీయ సంప్రదాయాలపై తనకున్న నమ్మకం గురించి ఎప్పుడూ చెబుతూ ఉంటారు. తరచుగా హిందూ మతంపై తనకున్న విశ్వాసాన్ని గురించి వెల్లడిస్తూనే ఉన్నారు. తాను హిందువునని అందరిలాగే తాను కూడా తన విశ్వాసాలతో స్ఫూర్తిని పొందుతానని చెప్పారు. 'భగవద్గీత'పై పార్లమెంటు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయడం గర్వంగా ఉందని కూడా చెప్పారు. రిషి సునక్ తన పిల్లలకు కూడా సంప్రదాయాన్ని అందించాలనుకుంటున్నట్లు చెప్పారు. తాను తన జీవితాన్ని ఎలా గడుపుతున్నానో.. అదే విధంగా తన కుమార్తెలకు అందించాలనుకుంటున్నానని చెప్పారు.

# అయోధ్యలో 'గేయ రామాయణం' ఆవిష్కరణ

### డా.గజల్ శ్రీనివాస్ హిందీ భాషలో స్వరపరచి అలపించిన గేయ రామాయణం

● 17 నిమిషాల నిడివి ఉన్న గేయ రూపం




అయోధ్య: ప్రఖ్యాత గజల్ గాయకుడు డా.గజల్ శ్రీనివాస్ హిందీ భాషలో స్వరపరచి అలపించిన 'గేయ రామాయణం'ను శ్రీ విదుర్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ కుమారానంద గిరి మహారాజ్ అయోధ్యలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయణాన్ని డా.గజల్ శ్రీనివాస్ 17 నిమిషాల నిడివిలో గేయ రూపంలో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించడం అభినందనీయమని ప్రశంసించారు. రచించిన కల్నల్ తిలక్ రాజ్ జలంధర్ను అభినందించారు. అనంతరం డా.గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ గేయ రామాయణం పరమ పవిత్రమైన పుణ్య క్షేత్రం అయోధ్యలో ఆవిష్కరించడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఐదువేల సంవత్సరాల ఘన చరిత్రతో గిరి సంప్రదాయం కలిగిన శ్రీ విదుర ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ కుమారానంద గిరి మహారాజ్ దివ్య హస్తాలతో ఈ గేయ రామాణం లోకార్పణం కావడం ఒక గొప్ప అనుభూతి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ త్రిపాఠి, అంకిత్ తివారి, బుల్బుల్ పాండే, మెడికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఛైర్మన్‌గా రాకేష్ నియామకం

### ప్రస్తుత ఛైర్మన్ గ్యారీ కెల్లీ స్థానంలో రాకేష్ కు బాధ్యతలు



వాషింగ్టన్: అమెరికాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ సౌత్వెస్ట్ ఎయిర్లైన్స్ ఛైర్మన్గా, ఇండిగో కో-ఫౌండర్ రాకేష్ గంగ్వాల్ నియమితులయ్యారు. ప్రస్తుత ఛైర్మన్ గ్యారీ కెల్లీ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ ఇయర్ జులైలో సౌత్వెస్ట్ ఎయిర్లైన్స్ బోర్డులో జాయిన్ అయినా రాకేష్ ఇటీవలే ఆ సంస్థకు చెందిన దాదాపు రూ. 900 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. సౌత్వెస్ట్ ఎయిర్లైన్స్ ప్రధాన వాటాదారు అయిన ఇలియట్ ఇన్వెస్ట్మెంట్ మేనేజ్మెంట్తో సౌత్వెస్ట్ ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత రాకేష్ గంగ్వాల్ నియామకం జరిగింది. కొత్తగా ఎన్నికైన బోర్డు కమిటీ అధ్యక్షులతో పాటుగా గంగ్వాల్ స్వతంత్ర బోర్డు ఛైర్మన్గా వ్యవహరిస్తారని సౌత్వెస్ట్ ప్రకటించింది. సౌత్వెస్ట్ ఎయిర్లైన్స్ సంస్థను తిరిగి లాభాల బాట పట్టించేందుకు ప్రెసిడెంట్, సీఈఓ బాబ్ జోర్డాన్తో కలిసి పని చేస్తానని గంగ్వాల్ వెల్లడించారు. కాగా యూఎస్ సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ల ప్రకారం, గాంగ్వాల్ సెప్టెంబర్ 30, అక్టోబర్ 1న సౌత్వెస్ట్లో 3.6 మిలియన్(36 లక్షలు) షేర్లను కొనుగోలు చేశారు. ఒక్కో షేరు ధర 29-30 డాలర్ల మధ్య ఉంది. మొత్తం కలిపి వీటి విలువ రూ. 900 కోట్లుగా ఉంటుందని తెలుస్తోంది. గంగ్వాల్ ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. ఇతను 2022లో స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీని స్థాపించాడు. గతంలో ఈయన వరల్డ్స్పాన్ టెక్నాలజీస్కు ఛైర్మన్ అండ్ సీఈఓగా నాయకత్వం వహించాడు.

# నటుడు మిథున్ చక్రవర్తిపై కేసు

### బీజేపీ సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపణ



కోల్ కతా : బీజేపీ నేత, ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి పై కోల్ కతాలోని విధాన్ నగర్ సౌత్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అక్టోబరు 27న బెంగాల్లోని నార్త్ 24 పరగణాల జిల్లాలో జరిగిన బీజేపీ సభలో మిథున్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని పోలీసులు ఆరోపించారు. "2026 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర అధికార పీఠం బీజేపీకి కైవసం అవుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఏమేం చేయాలో అవన్నీ బీజేపీ శ్రేణులు చేసి తీరుతాయి" అని మిథున్ వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు సంబంధించిన ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్షా కూడా పాల్గొన్నారు. మమతా బెనర్జీ సర్కారు కక్ష సాధింపు రాజకీయాల్లో భాగంగానే మిథున్పై కేసు బనాయించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ ఆరోపించారు. మిథున్ ప్రసంగంలో రెచ్చగొట్టే అంశమేదీ లేదని ఆయన స్పష్టం చేశారు.



# వైసీపీ నేతలపై మంత్రి అనగాని సంచలన వ్యాఖ్యలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఇవాళ (బుధవారం) జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్-1982 స్థానంలో ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్-2024కు ఆమోద ముద్ర వేసిన సంగతి విధితమే. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో భూ కబ్జాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు ఏపీలో చేసిన విచ్చలవిడి భూ దందాలను సీఎం దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలు పెరిగిపోయాయని, పేదల భూములను ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరించాలని పలువురు మంత్రులు మండిపడ్డారు. వారి భూ దాహానికి ఎంతో మంది ప్రజలు నష్టపోయారని సీఎంకు చెప్పారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రి మండలి ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్-2024కు ఆమోదం తెలిపింది. అయితే క్యాబినెట్ సమావేశం అనంతరం ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ గొప్ప మైలురాయిగా నిలుస్తుంది. భూములు కబ్జా చేసే వారి గుండెల్లో ఈ చట్టం రైళ్లు పరిగెత్తిస్తుంది. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో వైసీపీ గూండాలు రెచ్చిపోయారు.

విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడ్డారు. వారి వల్ల నష్టపోయామంటూ భూకబ్జాలపై ఎన్డీయే ప్రభుత్వానికి ప్రతి రోజూ వేల కొద్దీ ఫిర్యాదులు వస్తున్నాయి. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోయేవారని బాధితులు చెబుతున్నారు. ఇకపై ఈ పరిస్థితి మారబోతుంది. రాష్ట్రంలోని అన్ని రకాల భూములకు కొత్తగా తెచ్చే చట్టం వర్తిస్తుంది. ఎవరైనా కబ్జాలకు పాల్పడితే వారికి 10 నుంచి 14 ఏళ్లపాటు జైలు శిక్షతోపాటు భారీ స్థాయిలో జరిమానా విధించేలా చట్టం రూపొందించాం. కబ్జాదారునికి అక్రమాస్తులు ఉంటే వాటినీ కబ్జాలుగా పరిగణించి జప్తు చేస్తాం. ఈ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తాం. బాధితులు కోర్టుకైనా వెళ్లవచ్చు లేదా కలెక్టర్ నాయకత్వంలోని కమిటీకైనా ఫిర్యాదు చేయవచ్చు.

# ఆర్&బీ కాంట్రాక్ట్ బిడ్‌ల అర్హత కాల పరిమితి పెంపు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః రాష్ట్రంలో కాంట్రాక్టర్లు అందరికీ మేలు చేసే విధంగా 5 ఏళ్ల బ్లాక్ పీరియడ్ కాల పరిమితిని 10 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకోవడం జరిగింది.. గత 5 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో కాంట్రాక్టర్లు పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలా లేదు.. దీనికి ప్రధాన కారణం.. 3 ఏళ్ల పాటు కరోనా కారణంగా అభివృద్ధి పనులు జరగకపోవడం ఒకటైతే, మరోవైపు గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఊసే లేని పక్షంలో, ఆయా కాంట్రాక్టర్లకు పనులు చేసే అవకాశం రాలేదు.. ఒకవేళ అభివృద్ధి పనులు చేపట్టినా, బిల్లులు రాకపోవడం, లేదంటే అవి సకాలంలో పూర్తికాకపోవడం వంటి సమస్యలతో నేడు వారంతా ఆర్ & బీ కాంట్రాక్టర్లుగా బిడ్ వేసేందుకు అర్హత కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో నేడు రాష్ట్రంలోని మెజార్టీ కాంట్రాక్టర్లు ఆయా కాంట్రాక్ట్ పనులు చేపట్టడానికి తగిన అర్హత లేకుండా పోయింది.. ముఖ్యంగా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఆర్ & బీ శాఖలో జరగబోయే రోడ్ల అభివృద్ధి & మరమ్మతులు వంటి పనులు చేపట్టేందుకు, గతంలో 5 ఏళ్ల కాల పరిమితిలో ఆయా కాంట్రాక్టర్లు చేపట్టిన పనులు, టర్నోవర్ వంటివి ప్రాతిపదికగా తీసుకుంటే మెజార్టీ కాంట్రాక్టర్లు నేడు నష్టపోయే పరిస్థితి ఉంది.. ముఖ్యంగా 5 సంవత్సరాల కాల పరిమితిని అర్హత గా తీసుకోవడం వల్ల మెజార్టీ కాంట్రాక్టర్ లు, సామర్థ్యం ఉన్నా, అర్హత లేక ఆయా కాంట్రాక్ట్ పనులు చేపట్టే అవకాశం కోల్పోతారు.. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్ల నుంచి వచ్చిన వినతుల మేరకు ఆర్ & బీ శాఖ తరపున కాంట్రాక్టర్ల అందరి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బ్లాక్ పీరియడ్ ను 5 నుంచి 10 ఏళ్లకు పెంచాలనే సానుకూల నిర్ణయం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీసుకోవడం జరిగింది.. దీంతో రాష్ట్రంలోని మెజార్టీ కాంట్రాక్టర్లకు ఆర్ & బీ పనుల టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించేందుకు వీలుపడుతోంది.

## లోకేష్‌కు సహచర మంత్రుల అభినందనలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: అమెరికాలో వారం రోజులపాటు పెట్టుబడుల జైత్రయాత్రను విజయవంతంగా పూర్తిచేసి అమరావతి విచ్చేసిన మంత్రి లోకేష్ ను సహచర మంత్రులు ఉండవల్లి నివాసంలో కలిసి అభినందించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడానికి అలుపెరగని కృషి చేశారని మంత్రి లోకేష్ ని అభినందించారు.

# మెగా డీఎస్సీ వాయిదా

● ఐదారు రోజుల్లో నోటిఫికేషన్ ● ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ● అభ్యర్థుల్లో ఆందోళన



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః ఏపీ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామ ని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. గెలిచిన తరువాత ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బుధవారం నోటిఫికేషన్ విడుదల పైన సంకేతాలు ఇచ్చారు. కానీ, చివరి నిమిషంలో నిర్ణయం మారింది. త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అనివార్య కారణాలతో నోటిఫికేషన్ వాయిదా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరో నాలుగు లేదా అయిదు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పుకొచ్చారు. మెగా డీఎస్సీ నిర్వహణ పైన మంత్రి లోకేష్ సమీక్ష చేసారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఎస్సీలో సాధ్యమైనంత ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.

# కడప ఎస్పీ సీఐలపై చర్యలు



క్యాబినెట్ లో తీవ్రస్థాయిలో చర్చ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః రెండు రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ పోలీస్ యంత్రాంగం వైఫల్యం, కొందరు ఇంకా వైసీపీతో అంటకాగుతున్నారని చేసిన ఆరోపణల్లో ఎటువంటి అవాస్తవాలు లేవని కడప జిల్లాలోని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. కొంత మంది ఐపీఎస్ అధికారులు సైతం గత ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నారని పవన్ చేసిన ఆరోపణలు పోలీస్ యంత్రాంగంలో సంచలనం కలిగించాయి. డీజీపీ ద్వారకా తిరుమలరావు తాము ఎవరికీ అనుకూలంగా పని చేయడం లేదని, రాజ్యాంగం తమకు కల్పించిన అధికారాలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇవి వాస్తవం కాదని కడప జిల్లా ఎస్పీ, అక్కడి సర్కిల్ ఇన్స్ పెక్టర్ నిరూపించారు. ఇదే అంశంపైనా, కూటమి నేతలపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై ఏపీ కేబినెట్‌లోనూ కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా కడప ఎస్పీపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, హెూంమంత్రి అనిత సీరియస్ అయినట్లు సమాచారం. గత రాత్రి అదుపులోకి తీసుకున్న వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీందర్‌రెడ్డి (మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి వైస్ భారతి పీఏ) కడప పోలీసుల అదుపులో లేక పోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది వైసీపీ సోషల్ మీడియాలో యాక్టివిస్ట్ వర్రా రవీందర్ రెడ్డిని రాత్రి పులివెందులలో చిన్నచౌకు పోలీసులు అరెస్ట్ చేసి కడపకు తీసుకొచ్చారు. కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా.. 41ఏ నోటీసు ఇచ్చి పోలీసులు పంపించి వేసినట్లు సమాచారం. రవీంద్ రెడ్డి పోలీసుల అదుపులో ఉన్న విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా రాజంపేట పోలీసులు కడపకు వచ్చారు. ఓ కేసులో రవీందర్ రెడ్డిని తీసుకెళ్ళేందుకు అక్కడికి రాగా... 41ఏ నోటీసు ఇచ్చి అతడిని పంపినట్లు తాలూకా పోలీసులు చెప్పారు. దీంతో వెంటనే రవీందర్ రెడ్డి కోసం రాజంపేట పోలీసులు బయటకు వచ్చి గాలించగా అప్పటికే అతడు పరారైనట్లు తెలుస్తోంది. రవీందర్ రెడ్డి స్నేహితుడు మహేశ్వరరెడ్డిని కూడా రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహేశ్వరరెడ్డి వేముల వద్ద తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అతడికి కొట్టి వాహనంలో ఎక్కించుకున్నారు. అయితే వర్రా రవీందర్ రెడ్డిని తప్పించిన ఎపిసోడ్ మొత్తం ఎంపీ అవినా ష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ కావడంతో హుటా హుటిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కడపకు చేరుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో సమావేశమై రవీందర్ రెడ్డి గురించి డీఐజీ ఆరా తీస్తున్నారు కడప ఎస్పీపై చర్యలు మరోవైపు ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజును బాధ్యుడిని చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కడప ఎస్పీని బదిలీ చేసిన సర్కార్.. మరికొద్ది సేపటిల్లో అధికారిక ఉత్తర్వులను వెలువడించే అవకాశం ఉంది. కడప జిల్లాలో మరో సీఐను కూడా సర్కార్ సస్పెండ్ చేసింది. వైసీపీ నేత వర్రా రవీంద్ర రెడ్డిని అరెస్ట్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి భారతి పీఏగా రవీంద్రారెడ్డి ఉన్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. రవీంద్రారెడ్డి పోస్టులపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఏపీ కేబినెట్‌లో సీఎం దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. ఈ క్రమంలో కడప ఎస్పీని బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## రైల్వే లైన్ల సర్వే కోసం రూ.2.48 కోట్లు విడుదల



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః మచిలీపట్నం-రేపల్లె, రేపల్లె-బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ల నిర్మాణాల సర్వే కోసం రైల్వే బోర్డు నిధులు విడుదల చేసింది. మచిలీపట్నం- రేపల్లె మధ్య 45.35 కిలో మీటర్ల నివేదిక కోసం ?1.13 కోట్లు, బాపట్ల-రేపల్లె మధ్య 45.81 కిలో మీటర్ల మేర నివేదికకు రూ.1.15 కోట్లు విడుదలయ్యాయి. ఈ 2 రైల్వే లైన్లు అందుబాటులోకి వస్తే చెన్నై-హౌరా వెళ్లే రైళ్లు విజయవాడ వెళ్లకుండా మచిలీపట్నం మీదుగా రాకపోకలు సాగించవచ్చు.విజయవాడ స్టేషన్ పై భారం తగ్గుతుంది.

## వైకాపా మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇంటిపై ఐటీ దాడులు



భీమవరం: వైకాపా నేత, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇల్లు, కార్యాలయంపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఇంటితో పాటు కృష్ణా జిల్లా నాగాయలంకలోని కార్యాలయం, ఇతర వ్యాపార సముదాయాలపై ఏక కాలంతో సోదాలు జరుగుతున్నాయి. దిల్లీ నుంచి వచ్చిన అధికారులు వివిధ పత్రాలు తనిఖీ చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.


# వైఎస్ జగన్‌కు బిగ్‌షాక్



● స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అనర్హత చట్ట విరుద్ధం ● హైకోర్టు తీర్పు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి బిగ్ షాక్ తగిలింది. పార్టీ ఫిరాయించిన శాసన మండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజుపై పడిన అనర్హత వేటును ఏపీ హైకోర్టు కొట్టివేసింది. అది చట్ట విరుద్ధమైనదంటూ తేల్చింది. వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై గతంలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. రఘురాజు భార్య తెలుగుదేశం పార్టీలో చేరడం, ఆయన ఆ పార్టీకి అనుబంధంగా కొనసాగుతున్న నేపథ్యంలో- ఫిరాయింపుల నిరోధక చట్టం కింద మండలి ఛైర్మన్ ఈ చర్య తీసుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు రఘురాజు. ఎలాంటి వివరణ కోరకుండా, షోకాజ్ నోటీస్ జారీ చేయకుండా శాసన మండలి ఛైర్మన్ ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నారని పిటీషన్‌లో పొందుపరిచారు. తాను ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించలేదని అన్నారు. ఒక పార్టీ నుంచి చట్టసభకు ఎన్నికైన సభ్యుడు మరో పార్టీలో చేరితేనే ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తిస్తుంది. ఆయన కుటుంబ సభ్యులు ఎవరైనా పార్టీ ఫిరాయించితే ఇది వర్తింపు కాదు. ఈ నిబంధన కింద రఘురాజుపై వేసిన వేటును ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఫలితంగా- మండలి సభ్యుడిగా పూర్తి కాలం పాటు అంటే 2027 నవంబర్ వరకూ కొనసాగడానికి వీలు కల్పించినట్టయింది. ఈ నేపథ్యంలో విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఈసీ ఇదివరకే విడుదల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలను వైఎస్ఆర్సీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంభంగి చిన అప్పల్నాయుడిని ఎంపిక చేసింది. ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన కొన్ని గంటల్లోనే ఏపీ హైకోర్టు తీర్పు వెలువడటం చర్చ నీయాంశమైంది. ఇందుకూరి రఘురాజు పూర్తి కాలం పాటు కొనసాగానికి ఏపీ హైకోర్టు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో- ఇక విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉండక పోవచ్చునే అంచనాలు ఉన్నాయి. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా ఈ ఉప ఎన్నిక నోటిఫికేషన్‌ను ఈసీ రద్దు చేసే అవకాశాలు లేకపోలేదు.

## ట్రంప్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు



అమరావతి: అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డోనాల్డ్ ట్రాంప్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఆయన సారథ్యంలో అమెరికా మరింత పురోగతి సాధిస్తుందని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గతంలో అమెరికా దేశాధ్యక్షుడు ట్రంప్ హయాంలో భారత్, అమెరికా దేశాల మధ్య భాగస్వామ్య బంధం మరింత దృఢ పడిందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అలాగే అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ ఇరు దేశాలు.. తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ఈ రెండు దేశాలు సహకారాన్ని మరింత పెంపొందించుకుంటాయని తాను విశ్వసిస్తున్నానని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు తెలిపారు.

# కొలువు తీరిన టీటీడీ పాలకమండలి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః టీటీడీ చైర్మన్‌గా బొల్లినేని రాజగోపాల్ నాయుడు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే 17 మంది సభ్యులు ప్రమాణం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలిలో బీఆర్ నాయుడు చేత ఈవో శ్యామలరావు ప్రమాణ స్వీకారం చేయించారు. టీటీడీ పాలకమండలి సభ్యులుగా పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా టీటీడీ నూతన పాలకమండలి కొత్త అధ్యక్షుడు బీఆర్ నాయుడు, 17 మంది సభ్యులు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ కూడా బాధ్యతలు స్వీకరించారు. తొలుత చైర్మన్, అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకార పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయకుల మండపంలో వారికి శేషవస్త్రాలు కప్పి వేద ఆశీర్వచనం చేశారు. కాగా బుధవారం సాయంత్రం అన్నమయ్య భవనంలో కొత్త పాలకమండలి మీడియా సమావేశంలో పాల్గొంటుంది.

**కొత్త బోర్డులో వీరు..** నూతన బోర్డులో టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు సభ్యులుగా నియమితులయ్యారు. జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి(కోవూరు) ఎంఎస్ రాజు(మడకశిర) స్థానం దక్కించుకున్నారు. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మితో పాటు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా కూడా కొత్త పాలకమండలిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని రఘుదేవపురానికి చెందిన అక్కిన మునికోటేశ్వరరావు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, పల్నాడు జిల్లాకు చెందిన జంగా కృష్ణమూర్తి, కుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి వైద్యం శాంతారాం, మంగళగిరికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి కూడా సభ్యులుగా నియమితులయ్యారు. ఇక జనసేన నుంచి పవన్‌కల్యాణ్ సన్నిహితుడు, తెలంగాణ జనసేన ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, పవన్‌కల్యాణ్ స్నేహితుడు బూరగాపు ఆనంద్‌సాయి, జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యురాలు అనుగోలు రంగశ్రీకి కొత్త బోర్డులో చోటు లభించింది. అలాగే ఫార్మా రంగంలో ఉన్న నాట్కో గ్రూప్ వైస్ చైర్మన్ సన్నపనేని సదాశివరావు, ఎన్ఆర్ఐ జాస్తి పూర్ణసాంబశివరావు, కర్ణాటక పారిశ్రామికవేత్తలు నరేషకుమార్, కాఫీ రంగంలో ప్రముఖుడైన ఆర్ఎన్ దర్శన్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి హెచ్ఎల్ దత్ సభ్యులుగా నియమితులయ్యారు. ఇక, తమిళనాడుకు చెందిన రామ్మూర్తి, ఎంసీఐ చైర్మన్‌గా పనిచేసిన గుజరాత్‌కు చెందిన కేతన్ దేశాయ్ కుమారుడు అదిత్‌దేశాయ్, మహారాష్ట్రకు చెందిన ఆర్థిక నిపుణుడు సౌరభ్ బోరా, కేంద్రమంత్రి అమిత్‌షా సన్నిహితుడు కృష్ణమూర్తి వైద్యనా?థన్ కూడా సభ్యులుగా స్థానం దక్కించుకున్నారు. స్థానికంగా ఉంటూ శ్రీవారి భక్తుల సమస్యలపై నిరంతరం స్పందించే బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాషరెడ్డి కూడా నూతన బోర్డులో ఉన్నారు.

**వారికి మళ్లీ అవకాశం** తాజా బోర్డులో మరోసారి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసినవారిలో కృష్ణమూర్తి వైద్యనాథన్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, సౌరభ్ బోరా, సుచిత్ర ఎల్లా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి సభ్యులుగా ఉన్నారు. ఇక మహారాష్ట్రకు చెందిన సౌరభ్ బోరా చివరి రెండు బోర్డుల్లో సభ్యుడిగా కొనసాగారు. అలాగే భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన బోర్డులో సభ్యురాలిగా ఉన్నారు. ఇక, కేంద్ర హెూం మంత్రికి సన్నిహితుడుగా పేరున్న చెన్నైకు చెందిన కృష్ణమూర్తి వైద్యనాథన్ 2015 నుంచి వరుసగా(ఐదుసార్లు) టీటీడీ బోర్డులో కొనసాగుతున్నారు.

**వారసులుగా ఇద్దరు** తిరుప్పూర్ బాలుగా పేరున్న బాలసుబ్రహ్మణియన్ పళనిస్వామి గత ప్రభుత్వంలో సభ్యుడిగా ఉన్నారు. అయితే ఈసారి ఆయన సోదరుడు రామ్మూర్తి బోర్డులో అవకాశం దక్కించుకున్నారు. అలాగే గత బోర్డులో సభ్యుడిగా ఉన్న కేతిన్ దేశాయ్ కుమారుడు, కుసుమ్ ధీరజ్‌లాల్ ఆస్పత్రి ఎండీ అదిత్ దేశాయ్‌కి ఈసారి అవకాశం లభించింది

## తప్పుడు ప్రచారం చేసిన వైసీపీ
# నేత రిమాండ్‌కు తరలింపు



గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వెంకట రామిరెడ్డికి గుంటూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఎన్డీయే ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ అగ్రనేతలపై సోషల్ మీడియాలో అభ్యంతరక పోస్టులు పెట్టాడంటూ నవంబర్ 4న అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం, మంత్రులపై దుష్ప్రచారాలు చేస్తున్నాడంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు వెంకటరామిరెడ్డిని ఇవాళ (బుధవారం) నగరంపాలెం పోలీసులు కోర్టు ఎదుట హాజరు పరిచారు. దీంతో వైసీపీ నేతకు 14 రోజుల రిమాండ్‌ను కోర్టు విధించింది. కాగా, ఇవాళ జరిగిన క్యాబినెట్ సమావేశంలో సోషల్ మీడియా దుష్ప్రచారంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు ఫైర్ అయ్యారు. ఈ అంశంపై మంత్రిమండలి సుదీర్ఘంగా చర్చలు జరిపింది. వైసీపీ నేతలు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ క్యాబినెట్ సమావేశంలో పవన్ చర్చను లేవనెత్తారు. ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంనైన తనపైనా విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. మంత్రులు, ఇంట్లో ఉన్న ఆడవారిపైనా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొంత మంది పోలీసులు సైతం వైసీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని ఆయన మండిపడ్డారు. దీనిపై ఫిర్యాదు చేస్తే పోలీసు అధికారులు సైతం పట్టించుకోవడం లేదని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా తానే ఫోన్ చేసినా కొంత మంది ఎస్పీలు స్పందించడం లేదని మండిపడ్డారు. తమ కింది స్థాయి అధికారులపై నెపం నెట్టి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు నెల రోజుల్లో పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేద్దామని పవన్‌కు చెప్పారు. వైసీపీ వాసనలు ఇంకా వారిలో పోలేదని అంతా సెట్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనిపై చర్చించి వారిని గాడిలో పెడదామని డిప్యూటీ సీఎంకు చెప్పారు. ఈ నేపథ్యంలో సీరియస్ అయిన రాష్ట్ర ప్రభుత్వం అలాంటి అధికారులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజును బదిలీ చేయగా, జిల్లాకు చెందిన ఓ సీఐని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, హెూంమంత్రి అనితపై అసభ్యకర పదజాలంతో కడపకు చెందిన వర్రా రవీంద్రరెడ్డి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. పవన్ కల్యాణ్ సీరియస్ కావడంతో కేసు నమోదు చేసిన కడప పోలీసులు మంగళవారం సాయంత్రం అతన్ని అరెస్టు చేశారు. అనంతరం 41ఏ నోటీసు ఇచ్చి వదిలిపెట్టారు. అయితే మరో కేసులో అతడిని అరెస్టు చేసేందుకు కడప పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన రాజంపేట పోలీసులకు రవీంద్రరెడ్డిని అప్పగించకుండా వారు నేరుగా వదిలేశారు. ఈ విషయం కాస్త రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి రావడంతో వారిపై చర్యలు తీసుకున్నారు.


# అరబిందోపై విచారణ జరపాలి



● వందల కోట్లు దోచుకుంది. ● 108 సర్వీసులు సక్రమంగా నడవని కారణంగా అమాయకుల ప్రాణాలు పోయాయి
● అరవిందో వైఫల్యాన్ని కాగ్ బట్టబయలు చేసింది ● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ద్వజం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: అరబిందో కంపెనీపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో 108 బాధ్యతలను చేజిక్కించుకున్న అరబిందో కంపెనీ వందల కోట్లు దోచుకుని ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీసిందని విమర్శించారు. 108 అంబులెన్సుల నిర్వహణలో అరబిందో కంపెనీ వైఫల్యాన్ని కాగ్ బట్టబయలు చేసిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏ2 విజయసాయిరెడ్డి వియ్యంకుడి కంపెనీకి ప్రజల సొత్తును జగన్ రెడ్డి దోచిపెట్టారని మండిపడ్డారు. గోల్డెన్ అవర్ పాటించడంలోనూ అరబిందో విఫలమైందన్నారు. గతంలోనే గోల్డెన్ అవర్ విషయం కాగ్ స్పష్టం చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సకాలంలో ఆస్పత్రులకు చేర్చకుండా వందల మంది అమాయకుల ప్రాణాలు బలితీసుకున్న అరబిందో కంపెనీ యాజమాన్యంపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. అరబిందో కంపెనీ అరాచకాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. 108 అంబులెన్సుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తమకు రూ.141 కోట్లు చెల్లించాలని అరబిందో కంపెనీ చెబుతోందని.. అరబిందో కంపెనీ ఏ2 విజయసాయిరెడ్డి వియ్యంకుడు రాంప్రసాద్ రెడ్డి, తన అల్లుడు రోహిత్‌కు చెందినదన్నారు. 2011 నుంచి 2016 వరకు 108 అంబులెన్సుల నిర్వహణ బాధ్యతను జీవీకే సంస్థ సమర్ధవంతంగా నిర్వహించిందన్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి 2021 వరకు కూడా అదే సంస్థను పొడిగించిందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే జీవీకే సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని ఒక జీఓ ద్వారా బలవంతంగా రద్దు చేసిందన్నారు. జీవీకే సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కో అంబులెన్సుకు నెలకు రూ.1.31 లక్షలు అయితే అరబిందో కంపెనీకి రూ.1.78 లక్షలు చెల్లించారన్నారు. కొత్త అంబులెన్సుకు అయితే నెలకు రూ.2.21 లక్షలకు పెంచారని తెలిపారు. నిర్వహణ ఖర్చుల్లో చేసిన ఈ మార్పులతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ.800 కోట్లకు పైగా భారం పడిందన్నారు. ఎవడబ్బ సొత్తు అని అరబిందో కంపెనీకి దోచిపెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరబిందో కంపెనీపై అంత ప్రేమ ఎందుకు అని నిలదీశారు. ఏ2 విజయసాయిరెడ్డి వియ్యకుండి కంపెనీకి ప్రజల సొత్తును దోచిపెట్టేందుకు ఆర్నెళ్లలో 6 జీఓలు ఇచ్చారన్నారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ పర్యవేక్షణలో ఉన్న 108 అంబులెన్సులను ఆరోగ్య శ్రీ పరిధిలోకి మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. అరబిందో కంపెనీ ముసుగులో జరిగిన అరాచకాలపై విచారణ జరపాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. 108 అంబులెన్సుల నిర్వహణ విషయంలో గోల్డెన్ అవర్ పాటించడంలో విఫలమైన ఆ సంస్థపై హత్య కేసు నమోదు చేయాల్సిందే అని పట్టుబట్టారు. ఎంత మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారో తేల్చాలన్నారు. అంబులెన్సుల ట్రిప్పుల నమోదు విషయంలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఐదేళ్లలో జరిగిన భారీ దోపిడీపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు.

## కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు ఎంపీ పురందేశ్వరి



అమరావతిః ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సదస్సులో చర్చిస్తున్న అంశాలపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలిసి జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళా సాధికారికత కోసం మన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశంలో చేపడుతున్న సానుకూల, కచ్చితమైన అంశాలను సవివరంగా వివరించడానికి ఈ సదస్సు ద్వారా మంచి అవకాశం దొరికిందని ఆమె పేర్కొన్నారు. 8వ తేదీ వరకు కాన్ఫరెన్స్ లో పాల్గొని, 11న స్వదేశానికి తిరిగి రానున్నారు.



# అమెరికా ఉపాధ్యక్షుడు ఆంధ్రా అల్లుడు

## ట్రంప్ సర్కార్‌లో ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్

## వాన్స్ భార్య ఉష తెలుగమ్మాయి

**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆంధ్రప్రదేశ్ అల్లుడు ఉపాధ్యక్షుడు కానున్నారు. 538 ఎలక్టోరల్ ఓట్లు ఉన్న అమెరికాలో గెలుపు కోసం 270 ఓట్లు అవసరం కాగా.. రిపబ్లికన్ పార్టీ మెజార్టీ మార్క్ లీడ్‌ను దాటడంతో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షులు కానున్నారు. ఇక ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ ఎన్నికకానున్నారు. గత ఎన్నికల్లో భారత మూలాలున్న కమల హారీస్ అమెరికా వైస్ ప్రెసిడెంట్ కాగా.. ఈసారి తెలుగు మూలాలున్న వ్యక్తి భర్త ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కానున్నారు. దీంతో ప్రస్తుతం అమెరికా ఉపాధ్యక్షుడి భార్య ఉషా చిలుకూరి పేరు ఇప్పుడు భారత్‌లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మార్మోగిపోతోంది. మరిన్ని వివరాలలోకి వెళితే...**



అమెరికాకు 47వ అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీకి చెందిన డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టనున్నారు. ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ వ్యవహరించనున్నారు. అంటే ఆంధ్రా అల్లుడు అగ్రరాజ్యానికి ఉపాధ్యక్షుడు కానున్నరన్నమాట.

ఆయన భార్య ఉష తెలుగమ్మాయి కావడం ఇందుకు నేపథ్యం. ఆమె అమెరికాకు సెకండ్ లేడీగా వ్యవహరించబోతున్నారన్నమాట. ఒహాయో రాష్ట్ర సెనేటర్‌గా జేడీ వాన్స్‌ను ఉపాధ్య అభ్యర్థిగా ట్రంప్ ఎంపిక చేసుకున్నప్పటి నుంచే ఉష పేరు మార్మోగింది. ఎన్నికల్లో రిపబ్లికన్ల విజయం వేళ ఆమె పేరు మరోసారి తెరపైకి వచ్చింది.

ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వికులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లి అమెరికాలో స్థిరపడ్డారు. . వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. తల్లి లక్ష్మి మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ రంగ నిపుణురాలు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే, శాన్‌డియాగో విశ్వవిద్యాలయంలో కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ పదవిలో ఉన్నారు. తండ్రి రాధాకృష్ణ... క్రిష్ చిలుకూరిగా అందరికీ పరిచయం. ఆయన ఏరోస్పేస్ ఇంజినీర్. యునైటెడ్ టెక్నాలజీస్ ఏరోస్పేస్ సిస్టమ్స్ ఏరోడైనమిక్స్ స్పెషలిస్ట్‌గా పనిచేశారు. ఆపై కాలిన్స్ ఏరోస్పేస్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు.

. 1986లో కాలిఫోర్నియాలో జన్మించిన ఉషా చిలుకూరి.. శాన్ డియాగో శివారులో పెరిగారు. ఆమె రాంచో పెనాస్క్విటోస్‌లోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో విద్యను అభ్యసించారు. న్యూయార్క్ టైమ్స్ ప్రకారం.. ఆమె యేల్ విశ్వవిద్యాలయం నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు. న్యాయ సంబంధమైన విభాగాల్లో సుదీర్ఘంగా పనిచేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జాన్ రాబర్ట్స్, జస్టిస్ బ్రెట్ కెవానా వద్ద విధులు నిర్వర్తించారు. పటిష్ఠమైన విద్యా నేపథ్యమున్న ఆమె.. యేల్ విశ్వవిద్యాలయంలో లా అండ్ టెక్ జర్నల్‌కు మేనేజింగ్ ఎడిటర్‌గా, యేల్ లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. నాలుగేళ్ల పాటు అదే విశ్వవిద్యాలయంలో ఆమె అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం కేంబ్రిడ్జి యూనివర్సిటీకి గేట్స్ ఫెలోగా వెళ్లారు. అక్కడ ఆమె లెఫ్ట్-వింగ్, లిబరల్ గ్రూప్స్‌తో కలిసి పనిచేశారు.

### వాన్స్‌తో పరిచయం అలా..

యేల్ యూనివర్సిటీలో నాలుగేళ్లపాటు పాఠ్యేతర కార్యకలాపాలు నిర్వహించిన తర్వాత కేంబ్రిడ్జ్ నుంచి ఉషా చిలుకూరికి గేట్స్ ఫెలోషిప్ దక్కింది. దీంతో ఆమె తన అధ్యయనాలను కొనసాగిం చారు. అయితే యేల్ లా స్కూల్‌లో ఉన్న సమయంలో 2013లో జేడీ వాన్స్‌ను ఉషా చిలుకూరి కలిశారు. వారు కలిసి "సోషల్ డిక్లైన్ ఇన్ వైట్ అమెరికా"పై చర్చా సమూహాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వారిద్దరి మధ్య ప్రేమ బంధం ఏర్పడింది. ఆ తర్వాత వారు 2014లో వివాహం చేసుకున్నారు. ఒక హిందూ పూజారి సమక్షంలో నిర్వహించిన వేడుకలో ఇద్దరూ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. జేమ్స్ డేవిడ్ వాన్స్-ఉషా చిలుకూరి వాన్స్ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి పేర్లు ఇవాన్, వివేక్, మిరాబెల్.

ఉషా చిలుకూరి వృత్తిపరంగా కూడా మంచి ట్రాక్ రికార్డును కలిగివున్నారు. న్యాయవాదిగా నామినేట్ అవ్వడానికి ముందు ఆమె సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జాన్ రాబర్ట్స్, బ్రెట్ కవనాగ్ వద్ద సహాయకురాలిగా పనిచేశారు. వాన్స్ 2016లో తన రచన "హిల్‌బిల్లీ ఎలిజీ"తో ప్రాముఖ్యతను పొందగా.. ఇది బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఒహియోలోని మిడిల్‌టౌన్‌లో అతని పెంపకాన్ని, రస్ట్ బెల్ట్ ప్రాంతంలో శ్వేతజాతి కార్మికవర్గం ఎదుర్కొంటున్న సాంస్కృతిక, ఆర్థిక సవాళ్లను ఆ పుస్తకంలో వివరించారు. అయితే పుస్తకం తీసుకురావడంలో వాన్స్ సతీమణి ఉషా కృషి కూడా ఎంతో ఉంది. అయితే ఈ పుసక్తం ఆధారంగా 2020లో రాన్ హెూవార్డ్ దర్శకత్వంలో సినిమాను తెరకెక్కించారు.

జేడీ వాన్స్ విజయంలో ఉష పాత్ర ఎంతో ఉంది. భర్త తరుచూ రాజకీయ కార్యక్రమాలకు వెళ్లేలా ప్రోత్సహించేవారు. ఆయనతో కలిసి ఆమె కూడా వెళ్లేవారు. భర్త తీసుకునే రాజకీయ నిర్ణయాలకు మద్దతు ప్రకటించేవారు. సూచనలు చేసేవారు. జేడీ వాన్స్ ఓహియో సెనేటర్‌గా పోటీ చేసినప్పుడు ఉష విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.



## వంశవృక్షం

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామం ఉషా చిలుకూరి పూర్వీకుల స్వగ్రామం. ఉషకు తాత వరుస అయిన రామ్మోహనరావు కుటుంబం ప్రస్తుతం ఇక్కడే నివాసం ఉంటుండగా వారి వంశవృక్ష పటం లభ్యమైంది. ఉష పూర్వీకులు దశాబ్దాల కిందటే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా సాయిపురంలో 18వ శతాబ్దంలో చిలుకూరి బుచ్చిపాపయ్య శాస్త్రి నివసించారు. ఆయన సంతానమే శాఖోపశాఖలుగా ఉష వరకు విస్తరించింది. ఆమె ముత్తాత వీరావధాన్లుకు ఐదుగురు సంతానం. రామశాస్త్రి, సూర్యనారాయణ శాస్త్రి, సుబ్రహ్మణ్యశాస్త్రి, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణమూర్తి అందరూ ఉన్నత విద్యావంతులే.

రామశాస్త్రి మద్రాసు వలస వెళ్లిపోయి ఐఐటీ మద్రాసులో ప్రొఫెసర్గా పనిచేశారు. ఆయన భార్య బాలాత్రిపుర సుందరి కాగా, వీరికి అవధాని, నారాయణశాస్త్రి, రాధాకృష్ణ అనే ముగ్గురు కుమారులున్నారు. శారద ఒక్కగానొక్క కుమార్తె. ముగ్గురు కుమారులూ అమెరికాలో స్థిరపడగా శారద మాత్రం చెన్నైలో నివాసం ఉంటూ వైద్యురాలిగా స్థిరపడ్డారు. ఏరో నాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన రాధాకృష్ణ శాన్‌డియాగో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. పామర్రుకు చెందిన లక్ష్మితో ఆయనకు వివాహం కాగా వారి సంతానమే ఉష. ఉష తాత రామశాస్త్రి చిన్న సోదరుడు గోపాలకృష్ణమూర్తి తాను తోడల్లుళ్లం అవుతామనీ సాయిపురానికి చెందిన రామ్మోహనరావు తెలిపారు. ఒక ఇంటి ఆడపడుచులనే తాము వివాహం చేసుకున్నామని చెప్తూ ఇటీవల వంశవృక్షం రూపొందించామని వివరించారు.



## బంధువర్గం సంతోషం

జేడీ వాన్స్‌ను అమెరికా ఉపాధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ ఎంపిక చేయడంపై శాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఉష తల్లిదండ్రులు ఎప్పుడో అమెరికాలో స్థిరపడ్డారని ఆమె అక్కడే పుట్టి పెరగిన నేపథ్యంలో అంతగా పరిచయం లేదన్నారు. వాన్స్ అభ్యర్థిత్వం, తమ బంధుత్వం గురించి తెలిశాక పలువురు ఫోన్‌లో అభినందనలు తెలిపారని శాంతమ్మ వెల్లడించారు. చెన్నైలో వైద్యురాలిగా పనిచేస్తున్న ఉష మేనత్త శారద ఉష, వాన్స్ వివాహానికి సైతం హాజరైనట్లు గుర్తు చేసుకున్నారు. మా బంధువులు ఎందరో అమెరికాలో వివిధ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారని చెప్తూ అందులో ఉష దంపతులు ఈ స్థాయికి వెళ్లారని తెలియగానే గర్వంగా అనిపించిందని పేర్కొన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడి భార్య అయితే ఎక్కువ, లేకపోతే తక్కువ అని కాకుండా తమ ఆశీస్సులు వారికి ఎప్పుడూ ఉంటాయి అని శాంతమ్మ తెలిపారు.



## ఖెలిఫ్ లింగ వివాదం.. ఆయన క్షమాపణ చెప్పాల్సిందే

పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ విజేత ఇమేన్ ఖెలిఫ్ స్త్రీ కాదు, పురుషుడు అని ఇటీవల లీకైన వైద్య నివేదిక ద్వారా వెల్లడయింది. దీంతో ఆమె మహిళల విభాగంలో పోటీపడటంపై మరోసారి చర్చ మొదలైంది. ఓ ఫ్రెంచ్ పాత్రికేయుడు ఖెలిఫ్ వైద్య నివేదికను బయటపెట్టాడు. ఈవిషయంపై అంతర్జాతీయ బాక్సింగ్ సంస్థ అధ్యక్షుడు ఉమర్ క్రెమ్లెవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అన్ని క్రీడా నిబంధనలను ఉల్లంఘించి, మహిళపై పురుషుడిని నిలబెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి బాధ్యత వహిస్తూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు థామస్ బాచ్ మోకాలిపై కూర్చొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ వేదికలపై క్రీడకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐబీఏ పోరాడుతుంటుంది. ఆమె లింగం విషయంలో ఉన్న అనుమానాల వల్ల మహిళల విభాగంలో పోటీపడకుండా అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం 2023లో ఖెలిఫ్పై నిషేధం విధించింది. కానీ ఒలింపిక్స్లో పోటీపడేందుకు ఐఓసీ ఆమెకు అనుమతి ఇచ్చింది. అది ఇచ్చిన నివేదికల ఆధారంగా ఐబీఏ సైతం మద్దతిచ్చినట్లు సమాచారం. కాగా తాజాగా ఆమెకు సంబంధించిన మెడికల్ రిపోర్ట్ బహిర్గతం అవడంతో ఐబీఏ అధ్యక్షుడు ఉమర్ క్రెమ్లెవ్ ఒలింపిక్ కమిటీపై మండిపడ్డారు.

ఇప్పటికే ఈ వార్త అందరికీ తెలుసు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అన్ని క్రీడా నిబంధనలను ఉల్లంఘించి, మహిళపై పురుషుడిని నిలబెట్టింది. ఇమేన్ ఖెలిఫ్ పురుషుడేనని పరీక్షలు మళ్లీ నిర్ధరించాయి. కాబట్టి థామస్ బాచ్, అతడి బృందం ప్రపంచ బాక్సింగ్ సంఘానికి, అమ్మాయిలకు మోకరిల్లి క్షమాపణ చెప్పాలని నేను వారిని డిమాండ్ చేస్తున్నాను అని ఉమర్ క్రెమ్లెవ్ అన్నారు. ఇమేన్ ఖెలిఫ్ పురుషుడేనని తాజాగా వైద్య నివేదిక లీక్ అవడంతో క్రీడా ప్రపంచంలో పెద్ద వివాదమే చెలరేగింది. ఆ బాక్సర్ను పరీక్షించిన ఫ్రెంచ్, అల్జీరియా వైద్యులు 2023లో ఈ నివేదికను రూపొందించారు.

# 24, 25వ తేదీల్లో ఐపీఎల్ వేలం




దిల్లీ: ఐపీఎల్ మెగా వేలాన్ని ఈ నెల 24, 25వ తేదీల్లో జెడ్డా (సౌదీ అరేబియా)లో నిర్వహించనున్నట్లు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. సోమవారంతో ఆటగాళ్ల నమోదు అధికారికంగా ముగిసింది. మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 1165 మంది భారతీయులు, 409 మంది విదేశీయులు ఉన్నారు. బోర్డర్-గావస్కర్ సిరీస్ తొలి టెస్టు.. మూడు, నాలుగో రోజుల్లో వేలం ఉంటుంది.

204 మందికి అవకాశం: వేలంలో మొత్తం 204 మంది క్రికెటర్లను ఫ్రాంఛైజీలు కొనుక్కోవడానికి వీలుంది. ఒక్కో ఫ్రాంఛైజీ గరిష్ఠంగా 25 మంది (అట్టిపెట్టుకున్న క్రికెటర్లతో కలిపి) ఆటగాళ్లతో జట్టును తయారు చేసుకోవచ్చు. వేలం కోసం నమోదు చేసుకున్న ఆటగాళ్లలో 320 మంది అంతర్జాతీయ క్రికెట్ ఆడిన ఆటగాళ్లు, 1224 మంది అరంగేట్రం చేయని వాళ్లు ఉన్నారు. అసోసియేట్ దేశాలకు చెందిన ఆటగాళ్లు 30 మంది ఉన్నారు. క్యాప్డ్ ఆటగాళ్లలో 48 మంది, అన్క్యాప్డ్ ఆటగాళ్లలో 965 మంది భారతీయులు. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, అర్ష్‌దీప్ సింగ్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లు వేలంలో ఉన్నారు.

ఖర్చు చేయడానికి అన్ని ఫ్రాంఛైజీల వద్ద మొత్తం రూ.641.5 కోట్ల డబ్బుంది. పది ఫ్రాంఛైజీలు 46 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకున్నాయి. జట్లను నిర్మించుకోవడానికి ప్రతి ఫ్రాంఛైజీకి రూ.120 కోట్లు కేటాయించారు. రిటెన్షన్ ప్రక్రియ పూర్తయ్యాక పంజాబ్ కింగ్స్ వద్ద అత్యధికంగా రూ.110.5 కోట్లు ఉన్నాయి. ఆ జట్టు ఇద్దరు (శశాంక్ సింగ్, ప్రభ్సిమ్రన్) ఆటగాళ్లను మాత్రమే కొనసాగించింది. అతి తక్కువగా రాజస్థాన్ రాయల్స్ వద్ద రూ.41 కోట్లు ఉన్నాయి. భారత్ తర్వాత అత్యధికంగా దక్షిణాఫ్రికా నుంచి 91 మంది ఆటగాళ్లు వేలంలో ఉన్నారు. ఆస్ట్రేలియా నుంచి 76 మంది, ఇంగ్లాండ్ నుంచి 52 మంది, న్యూజిలాండ్ నుంచి 39 మంది క్రికెటర్లు వేలంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఫ్రాంఛైజీలు వేలంలో గరిష్ఠంగా 76 మంది విదేశీ ఆటగాళ్లను కొనొచ్చు.

**ఐపీఎల్ మెగా వేలం.. ఈ స్టార్ ఆటగాళ్ల కనీస ధర ఎంతంటే?**

ఐపీఎల్ మెగా వేలాన్ని నవంబర్ 24, 25వ తేదీల్లో జెడ్డా (సౌదీ అరేబియా)లో నిర్వహించనున్నారు. సోమవారంతో ఆటగాళ్ల నమోదు అధికారికంగా ముగియగా.. మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 1165 మంది భారతీయులు, 409 మంది విదేశీయులు ఉన్నారు. ఈసారి మెగా వేలంలో చాలామంది భారత స్టార్ ఆటగాళ్లున్నారు.

వీరు భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. గత సీజన్ వరకు కెప్టెన్లుగా ఉన్న రిషభ్ పంత్ (దిల్లీ), కేఎల్ రాహుల్ (లఖ్నవూ), శ్రేయస్ అయ్యర్ (కోల్కతా)లను ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకోలేదు. ఈ ముగ్గురు స్టార్ ఆటగాళ్లు తమ కనీస ధర రూ.2 కోట్లుగా నిర్ణయించుకున్నారు. రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమి, ఇషాన్ కిషన్, దీపక్ చాహర్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్, భువనేశ్వర్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ, టి.నటరాజన్, దేవ్దత్ పడిక్కల్, కృనాల్ పాండ్య, హర్షల్ పటేల్, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, ఖలీల్ అహ్మద్, ఉమేశ్ యాదవ్ కూడా రూ.2 కోట్ల కనీస ధరతో వేలంలో పేరు నమోదు చేసుకున్నారు. సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా బేస్ ధర రూ.75 లక్షలుగా నిర్ణయించుకున్నారు. గత సీజన్లో రూ.24.50 కోట్ల ధర పలికిన మిచెల్ స్టార్క్ రూ.2 కోట్ల బేస్ ధరతో వేలంలోకి వస్తున్నాడు.

**తొలిసారి ఐపీఎల్ వేలంలోకి ఇంగ్లాండ్ వెటరన్ పేసర్**

ఇంగ్లాండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ తొలిసారి ఐపీఎల్లో ఆడటం కోసం మెగా వేలంలో పేరు నమోదు చేసుకున్నాడు. అతడు రూ.1.25 కోట్ల కనీస ధరతో వేలంలో బరిలో నిలిచాడు. టెస్టు క్రికెట్లో అత్యధిక వికెట్లు (704) పడగొట్టి అండర్సన్ రికార్డు సృష్టించాడు. జిమ్మీ తన చివరి టీ20 మ్యాచ్ 2014లో ఆడటం విశేషం. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన అండర్సన్ మళ్లీ టీ20 క్రికెట్ ఆడాలనే ఆసక్తితో ఉన్నాడు. 2004లో టీ20ల్లోకి అరంగేట్రం చేసిన అండర్సన్.. కెరీర్ మొత్తంలో 44 టీ20లే ఆడి 41 వికెట్లు పడగొట్టాడు.

## డబ్ల్యూబీఎఫ్ టైటిల్ నెగ్గిన మన్‌దీప్



భారత ప్రొఫెషనల్ బాక్సర్ మన్దీప్ జాంగ్రా ప్రపంచ వేదికపై విజేతగా నిలిచాడు. ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) నిర్వహించిన వరల్డ్ సూపర్ ఫెదర్ వెయిట్లో ఛాంపియన్గా నిలిచాడు. 31 ఏళ్ల ఈ హర్యానా స్టార్ తన పంచ్లతో ప్రత్యర్థిని చిత్తు చేశాడు. ఫైనల్లో బ్రిటన్ బాక్సర్ కానర్ మెకంతోష్ను మట్టికరిపించాడు.

టైటిల్ పోరు ఆరంభం నుంచి పవర్ఫుల్ పంచ్లతో ప్రత్యర్థిపై మనదీప్ విరుచుకుపడ్డాడు. పది రౌండ్లలో ఏ రౌండ్లోనూ బ్రిటన్ బాక్సర్కు అవకాశమే ఇవ్వలేదు. మన్దీప్ ధాటికి మెకంతోష్ ప్రతిఘటించలేకపోయాడు. కాగా, ఈ క్రమంలో మన్దీప్ అమెచ్యూర్ సర్క్యూట్లో 11వ విజయాన్ని అందుకున్నాడు. అతను 12 సార్లు బరిలోకి దిగగా ఒక్కసారి మినహా మిగిలిన మ్యాచ్లో విజేతగా నిలిచాడు.

మాజీ ఒలింపిక్ రజత పతక విజేత రాయ్ జోన్స్ దగ్గర మన్దీప్ శిక్షణ తీసుకుంటున్నాడు. 31 ఏళ్ల మన్దీప్ 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. కాగా, డబ్ల్యూబీఎఫ్ టైటిల్ నెగ్గిన అనంతరం మన్దీప్ మాట్లాడాడు. తన కెరీర్లో అతిపెద్ద విజయాల్లో ఇది ఒకటి అని పేర్కొన్నాడు. కోచ్ రాయ్ జోన్స్, అసిస్టెంట్ కోచ్ అసా బీర్డ్, ఏంజెల్లకు ధన్యవాధాలు చెప్పాడు.

ఎన్నోఏళ్ల పాటు కఠోర శ్రమకు దక్కిన ప్రతిఫలం ఇది అని మన్దీప్ అన్నాడు. ఈ టైటిల్ దేశ ప్రతిష్టను మరింత పెంచుతుందని తెలిపాడు. అలాగే బాక్సర్లు ప్రొఫెషనల్ బాక్సింగ్ను కెరీర్గా ఎంచుకోవడానికి ఇది ప్రేరణ కలిగిస్తుందని పేర్కొన్నాడు. మన్దీప్ జాంగ్రా 2021లో ప్రొఫెషనల్ కెరీర్ ఆరంభించాడు.

### సఫారీలతో టీ20 సిరీస్.. ఆల్‌టైమ్ రికార్డుపై

## కన్నేసిన అర్ష్‌దీప్ సింగ్





నవంబర్ 8 నుంచి సౌతాఫ్రికా, భారత్ మధ్య నాలుగు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ డర్బన్ వేదికగా జరగనుంది. ఇప్పటికే భారత జట్టు దక్షిణాఫ్రికాకు చేరుకొని ప్రాక్టీస్లో నిమగ్నమైంది. టీమ్ఇండియాకు సూర్యకుమార్ యాదవ్, సౌతాఫ్రికాకు మార్క్రమ్లు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్లో భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఆల్టైమ్ రికార్డు సాధించే అవకాశముంది. టీ20ల్లో ఒక క్యాలెండర్ ఇయర్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన రికార్డు ప్రస్తుతం భువనేశ్వర్ కుమార్ పేరిట ఉంది. భువీ 2022లో 32 మ్యాచ్లు ఆడి 6.98 ఎకానమీతో 37 వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ ఈ ఏడాది ఇప్పటివరకు 14 మ్యాచ్లు ఆడి 7.14 ఎకానమీతో 28 వికెట్లు పడగొట్టాడు. గత టీ20 ప్రపంచకప్లో అమెరికాతో జరిగిన మ్యాచ్లో 9 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు దక్కించుకున్నాడు. సఫారీలతో సిరీస్లో అర్ష్‌దీప్ 10 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు సాధిస్తే భారత్ తరఫున టీ20ల్లో ఎక్కువ వికెట్లు పడగొట్టిన బౌలర్గానూ రికార్డుల్లోకెక్కుతాడు. ప్రస్తుతం ఈ జాబితాలో యుజ్వేంద్ర చాహల్ (96) అగ్రస్థానంలో ఉన్నాడు.భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, రింకు సింగ్, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్య, రమణ్దీప్ సింగ్, అక్షర్ పటేల్, సంజు శాంసన్, జితేశ్ శర్మ, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, విజయ్కుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్, యశ్ దయాళ్, అవేశ్ ఖాన్.

దక్షిణాఫ్రికా జట్టు: మార్క్రమ్ (కెప్టెన్), బార్ట్మన్, కొయెట్జీ, డొనోవన్ ఫెరీరా, రీజా హెండ్రిక్స్, మార్కో యాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, పాట్రిక్ క్రగర్, కేశవ్ మహరాజ్, డేవిడ్ మిల్లర్, మిలాలి ఎంపొంగ్వానా, ఎంకాబా పీటర్, రికల్టన్, సైమ్లేన్, సిపామ్లా, స్టబ్స్.

సౌతాఫ్రికా, భారత్ నాలుగు టీ20ల సిరీస్ షెడ్యూల్
తొలి టీ20 – నవంబర్ 8 (డర్బన్)
రెండో టీ20 – నవంబర్ 10 (గబెరా)
మూడో టీ20 – నవంబర్ 13 (సెంచూరియన్)
నాలుగో టీ20 – నవంబర్ 15 (జొహన్నెస్బర్గ్)

## అలీఘఢ్‌లో రూ.3.5 కోట్లతో ఇల్లు కొనుగోలు

### బంగ్లా కొనుగోలు చేసిన యంగ్ క్రికెటర్ రింకూ సింగ్..




టీమిండియా యంగ్ క్రికెటర్, కోల్కతా నైట్ రైడర్స్ జట్టు ఏకంగా రూ.13 కోట్లకు రిటెయిన్ చేసుకున్న ఆటగాడు రింకూ సింగ్ ఓ విలాసవంతమైన బంగ్లాను కొనుగోలు చేశాడు. ఉత్తరప్రదేశ్లోని అలీఘఢ్ లో రూ.3.5 కోట్లు వెచ్చించి ఈ ఇంటిని కొన్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం చేశాడు.

గోల్డెన్ ఎస్టేట్ ఏరియాలో ఈ బంగ్లా ఉంది. ఈ భవనం విస్తీర్ణం 500 చదరపు గజాలు అని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. కాగా గృహ ప్రవేశానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.

కాగా, ఐపీఎల్ 2023 సీజన్లో యశ్ దయాల్ బౌలింగ్లో ఒకే ఓవర్లో 5 సిక్సర్లు బాదడంతో రింకూ సింగ్కు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత పలు కీలకమైన ఇన్నింగ్స్ ఆడి పవర్ హిట్టర్గా నిరూపించుకున్నాడు. జాతీయ జట్టులో కూడా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న విషయం తెలిసిందే. ఐపీఎల్లో కోల్కతా నైట్ రైడర్స్ జట్టుకు రింకూ సింగ్ ఆడుతున్నాడు. ఇటీవల ఆ ఫ్రాంఛైజీ ప్రకటించిన రిటెన్షన్ జాబితాలో రింకూ సింగ్ పేరు కూడా ఉంది.

### విరాట్ కోహ్లీ.. పదేళ్ల తర్వాత

## టాప్-20 నుంచి ఔట్



న్యూజిలాండ్తో జరిగిన మూడు టెస్టులో రెండు అర్ధ సెంచరీలు చేసిన రిషభ్ పంత్ మళ్లీ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్లో టాప్-10లోకి దూసుకొచ్చాడు. పంత్ ఐదు స్థానాలు ఎగబాకి ఆరో స్థానంలో నిలిచాడు. కివీస్తో సిరీస్లో విరాట్ కోహ్లీ కేవలం 93 పరుగులే చేసి తీవ్ర నిరాశపర్చాడు. అతడు ఎనిమిది స్థానాలు దిగజారి టాప్-20 ర్యాంకింగ్స్ నుంచి బయటికి వచ్చాడు. కోహ్లీ ప్రస్తుతం 22వ స్థానంలో ఉన్నాడు. 2014 డిసెంబరు తర్వాత విరాట్ టాప్-20 నుంచి కిందికి పడిపోవడం ఇదే తొలిసారి. రోహిత్ శర్మ రెండు స్థానాలు దిగజారి 26వ స్థానానికి పడిపోయాడు. యశస్వి జైస్వాల్ ఒక స్థానం కోల్పోయి నాలుగో ప్లేస్లో నిలిచాడు. న్యూజిలాండ్తో ముంబయి టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్లో 90 పరుగులు చేసిన శుభ్మన్ గిల్.. నాలుగు స్థానాలు మెరుగై 16వ స్థానానికి చేరుకున్నాడు. మూడో టెస్టు మొదటి ఇన్నింగ్స్లో 82 రన్స్ చేసిన న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ ఎనిమిది స్థానాలు ఎగబాకి ఏడో స్థానంలో నిలిచాడు. జో రూట్, కేన్ విలియమ్సన్, హ్యారీ బ్రూక్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు.

బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. రవీంద్ర జడేజా రెండు స్థానాలు మెరుగై ఆరో స్థానంలో నిలిచాడు. అశ్విన్ ఒక స్థానం దిగజారి ఐదో స్థానానికి పడిపోయాడు. జస్ప్రీత్ బుమ్రా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. వాషింగ్టన్ సుందర్ ఏడు స్థానాలు మెరుగై 46వ స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో కగిసో రబాడ, హేజిల్వుడ్ వరుసగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. న్యూజిలాండ్ స్పిన్నర్ అజాజ్ పటేల్ 12 స్థానాలు జంప్ చేసి 22వ స్థానానికి చేరుకున్నాడు. ఆల్రౌండర్ల జాబితాలో పెద్దగా మార్పులు లేవు. ఈ విభాగంలో రవీంద్ర జడేజా టాప్లో కొనసాగుతున్నాడు.

## బోర్డర్-గావస్కర్ ట్రోఫీ..

# భారత్ ముందున్న అతిపెద్ద సవాలు




కివీస్తో మూడు టెస్టుల సిరీస్ను భారత్ అవమానకర రీతిలో 0-3తో కోల్పోయింది. న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాభవం చవిచూసిన టీమ్ఇండియా ఇప్పుడు కీలక సమరానికి సిద్ధమవుతోంది. నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. త్వరలోనే భారత జట్టు ఆస్ట్రేలియాకు బయలుదేరనుంది. ఈ సిరీస్కు సీనియర్ పేసర్ మహ్మద్ షమి అందుబాటులో లేదు. అతడు ఇంకా గాయం నుంచి పూర్తిస్థాయిలో కోలుకోకపోవడంతో ఎంపిక చేయలేదు.

పేస్ బౌలింగ్కు అనుకూలించే ఆస్ట్రేలియా పిచ్లపై షమి ఇంతకుముందు సిరీస్లో మంచి ప్రభావం చూపించాడు. ఇప్పుడతను లేకపోవడం టీమ్ఇండియాకు గట్టిదెబ్బే. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ బోర్డర్-గావస్కర్ ట్రోఫీ గురించి మాట్లాడాడు. సిరీస్ను ఆసీస్ 3-1తో కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశాడు. షమి ఆడకపోవడం ఆస్ట్రేలియాకు కలిసొస్తుందని పేర్కొన్నాడు.


ఐదు టెస్టు మ్యాచ్ల సిరీస్లో భారత్ ఒక మ్యాచ్ గెలుస్తుందని భావిస్తున్నాను. ఆస్ట్రేలియా కాస్త బలంగా కనిపిస్తోంది.

ఆస్ట్రేలియా సిరీస్ను 3-1తో గెలుస్తుందని అంచనా వేస్తున్నా. మునుపటితో పోలిస్తే ఆసీస్ విజయావకాశాలు పెరుగుతాయి. మహ్మద్ షమి లేకపోవడం భారత్ బౌలింగ్ బృందంలో భారీ లోటు కనిపిస్తోంది. షమి ఫిట్గా ఉంటాడా? లేదా అనే ఊహాగానాలు ఆగస్టు నుంచి ఇప్పటికీ వస్తున్నాయి.

ఒక టెస్టు మ్యాచ్లో 20 వికెట్లు తీయడం అనేది భారత్కు అతిపెద్ద సవాలుగా భావిస్తున్నాను. ప్రస్తుతం ఉన్న భారత బ్యాటింగ్ బృందం బాగా ఆడుతుందని భావిస్తున్నా అని పాంటింగ్ పేర్కొన్నాడు.

## ఆర్సీబీతో నా ప్రయాణం ఇంకా ముగియలేదు

ఐపీఎల్ మెగా వేలానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆల్ రౌండర్ గ్లెన్ మ్యాక్స్వెల్ను రిటైన్ చేసుకోలేదు. విరాట్ కోహ్లీ (రూ. 21 కోట్లు), రజత్ పాటిదార్ (రూ. 11 కోట్లు), యశ్ దయాళ్ (రూ. 5 కోట్లు)ను మాత్రమే రిటైన్ చేసుకుంది. మ్యాక్స్వెల్ తోపాటు కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ను కూడా ఆర్సీబీ అట్టిపెట్టుకోలేదు. ప్రస్తుతం బెంగళూరు ఫ్రాంఛైజీ వద్ద రూ.83 కోట్లు ఉండగా.. మూడు రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎం) కార్డు ఉన్నాయి. 2021 నుంచి టీమ్లో ఉన్న మ్యాక్స్వెల్ను బెంగళూరు రిటైన్ చేసుకోకపోవడం చాలామందిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఆర్సీబీ తనను అట్టిపెట్టుకోవడంపై మ్యాక్స్వెల్ తాజాగా స్పందించాడు. హెడ్కోచ్ ఆండీ ఫ్లవర్, ఫ్రాంఛైజీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బోబాట్ తనతో మాట్లాడారని, రిటైన్ చేసుకోకపోవడానికి గల కారణాలను వివరించారని మ్యాక్స్వెల్ పేర్కొన్నాడు. నాకు మో బోబాట్, ఆండీ ఫ్లవర్ నాతో జూమ్ కాల్ ద్వారా మాట్లాడారు. రిటైన్ చేసుకోకపోవడానికి గల కారణాలను వారు వివరించారు. దాదాపు అరగంట పాటు మాట్లాడుకున్నాం. ఆట, జట్టు వ్యూహం, మంచి ఫలితాలు రాబట్టడానికి ఎలా ముందుకు సాగాలనుకుంటున్నారనే విషయాలపై చర్చించాం. ఆర్సీబీ తీసుకున్న నిర్ణయంతో నేను సంతోషంగా ఉన్నా. వారు తమ సిబ్బందిలో కొంతమంది మారుస్తున్నారు. ఆటగాళ్లతో చర్చించడానికి ముందు వారు దీనిని క్రమబద్ధీకరించాలి.ఆ ప్రక్రియకు కొంత సమయం పడుతుందని నేను అర్థం చేసుకున్నాను. ఆర్సీబీతో నా ప్రయాణం ముగిసిందని చెప్పను. మళ్లీ తిరిగి జట్టులోకి రావాలనుకుంటున్నాను. ఇది గొప్ప ఫ్రాంఛైజీ. అక్కడ నా సమయాన్ని నిజంగా ఆనందించాను అని మ్యాక్స్వెల్ పేర్కొన్నాడు. మ్యాక్సీ ఆర్సీబీలో కీలక ఆటగాడు. ఎన్నో మ్యాచ్లో విధ్వంసకర ఇన్నింగ్స్లు ఆడి జట్టుకు విజయాలు అందించాడు. కానీ, గత సీజన్లో మాత్రం తీవ్రంగా నిరాశపర్చాడు. 9 ఇన్నింగ్స్లో కలిపి 52 పరుగులే చేశాడు. బెంగళూరు అతడిని ఆర్టీఎం కార్డ్ ఉపయోగించి తిరిగి జట్టులోకి తీసుకునే అవకాశాలు లేకపోలేదు. మెగా వేలాన్ని నవంబర్ 24, 25వ తేదీల్లో జెడ్డా (సౌదీ అరేబియా)లో నిర్వహించనున్నారు. మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 1165 మంది భారతీయులు, 409 మంది విదేశీయులు ఉన్నారు.



# కీర్తి సురేశ్ 'రివాల్వర్ రీటా'



నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ టైటిల్ రోల్ లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'రివాల్వర్ రీటా'. రాధిక శరత్‌కుమార్, రెడిన్ కింగ్స్లీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జే.కే చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. ప్యాషన్ స్టూడియోస్ ది రూట్ బ్యానర్స్‌పై సుధన్ సుందరం (మహారాజ్ నిర్మాత) జగదీష్ పళని స్వామి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది.తాజాగా ఈ మూవీ ఏపీ, తెలంగాణ రైట్స్‌ని సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ హాస్య మూవీస్ రాజేష్ దండా ఫ్యాన్సీ రేటుకి దక్కించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సీన్ రోల్డాన్ మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రవీణ్ కె ఎల్ ఎడిటర్, స్టంట్స్‌ని దిలీప్ సుబ్బరాయన్ సమకూరుస్తున్నారు.

## 'దేవకీ నందన వాసుదేవ' 'బంగారం' సాంగ్

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా తన సెకండ్ మూవీ 'దేవకి నందన వాసుదేవ' లో మాస్, యాక్షన్-ప్యాక్డ్ పాత్రలో కనిపించ నున్నారు. గుణ 369తో ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాల కృష్ణ నిర్మించారు. ఇప్పటికే రిలీజైన మూడు పాటలు సూపర్ హిట్ అయ్యాయి. మేకర్స్ 'బంగా రం' సాంగ్‌ని రిలీజ్ చేశారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసి రోలియో ఈ సాంగ్‌ని మాస్ డ్యాన్స్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. భోలే షావలి లిరిక్స్ మాస్‌ని ఆకట్టుకునేలా వున్నాయి. సింహా, ఉమా నేహ ఎనర్జిటిక్ వోకల్స్‌తో మెస్మరైజ్ చేశారు. ఈ సాంగ్‌లో అశోక్ గల్లా ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అదరగొట్టారు. అశోక్‌గల్లా, వారణాసి మానస కెమిస్ట్రీ సూపర్బ్‌గా వుంది. వైబ్రెంట్ సెట్స్‌లో షూట్ చేసిన ఈ సాంగ్‌లో విజువల్స్ చాలా గ్రాండ్‌గా వున్నాయి. డివైన్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కి హను మాన్ ఫేమ్ క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కథ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు.



# కంటెంట్ ఉంటే సినిమాకి జనాలొస్తారు



రాకేష్ వర్రే టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం జితేందర్ రెడ్డి. ఉయ్యాలా జంపాల, మజ్ను సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవంబర్ 8 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రెస్ మీట్ ఇటీవలే జరిగింది. హీరో రాకేష్ మాట్లాడుతూ, "ఎవరికీ చెప్పొద్దు సినిమా తర్వాత, చేస్తే మంచి సినిమా చేయాలి కానీ మాములు కంటెంట్‌తో సినిమా చేయకూడదు అని నిర్ణయించుకున్నాను. లేట్ అయినా కానీ మంచి సినిమా చేయాలనే నేను డిసైడ్ అయ్యాను. మార్కెట్ కానీ బ్రాండ్ కానీ లేకపోతే ఏ హీరో ని పట్టించుకోరు. రాకేష్ అనే నేను ఒక బ్రాండ్‌గా ఎదిగిన రోజున నేను కొత్త వాళ్ళతో సినిమా చేస్తాను. జితేందర్ రెడ్డి సినిమా నేను చేయడానికి కారణం ఈ సినిమా కథ. ఈ సినిమా పూర్తిగా చేసాం కానీ మేలో రిలీజ్ అనుకున్నాం. వేరే వేరే ఇష్యూస్ వల్ల సినిమా పోస్టుపోన్ అవుతూ వచ్చింది. ఇప్పుడేం బాన్ చేస్తాం అంటున్నారు. కనీసం సినిమా చూసింది అందులో ఏం ఉందొ కూడా చూడకుండా అలా మాట్లాడుతున్నారు. జితేందర్ రెడ్డి ఒక ఫైటర్. అయన అభిమానులు ఈ సినిమా చూస్తారు. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం నాకుంది. ఈ సినిమాకి 75 రూపీస్‌తో ప్రీమి యర్స్ ప్లాన్ చేస్తున్నాం" అని అయన అన్నారు.

## భీమ్లా నాయక్ డైరెక్టర్ లాంచ్ చేసిన "లగ్గం టైమ్"



టాలీవుడ్ ఇండస్ట్రీలో తరచుగా కొత్త నిర్మాణ సంస్థలు లాంచ్ అవుతుంటాయి. మంచి కథలు దొరకగానే వెంటనే తెలుగు ప్రేక్షకులను అలరించడానికి ఇవి సిద్ధమవుతుంటాయి. తాజాగా కొత్త నిర్మాణ సంస్థ "20 సెంచరీ ఎంటర్‌టైన్‌మెంట్స్" తమ ఫస్ట్ మూవీ టైటిల్‌ను ప్రకటించింది. తమ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ మొదటి చిత్రానికి 'లగ్గం టైమ్' అని టైటిల్ పెట్టినట్లు వెల్లడించింది. అంతేకాదు, ఈ మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు సాగర్ కె చంద్ర ఆవిష్కరించారు. 'లగ్గం టైమ్' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపిన సాగర్ కె చంద్ర, ఈ చిత్రం ప్రేక్షకులను అలరించాలని ఆకాంక్షించారు. వివాహం నేపథ్యంలో సాగే ఈ మూవీ ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే ఓ మంచి కథతో రానుందని అంటున్నారు. ఫ్యామిలీ మెంబర్స్ తో కలిసి ఎంజాయ్ చేసే సినిమాలా దీనిని తీస్తున్నామని మూవీ మేకర్స్ వెల్లడించారు.

# రెబెల్ స్టార్ చేతుల మీదుగా 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్'

ప్రతిభ గల రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందిన 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్ సైట్‌ను రెబెల్ స్టార్ ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా లాంఛ్ చేశారు. తన సినిమాలతో వైవిధ్యమైన కథలను ప్రేక్షకులను అందిస్తుంటారు ప్రభాస్. 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్ సైట్ ద్వారా మరిన్ని క్రియేటివ్ స్టోరీస్, టాలెంటెడ్ రైటర్స్ ఇండస్ట్రీకి రావాలనే ప్రయత్నానికి ప్రభాస్ తన వంతు మద్ధతు అందిస్తుండటం అభినందనీయం. రచయితలు తమ స్క్రిప్ట్ ను 250 పదాల నిడివిలో 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్ సైట్‌లో అప్ లోడ్ చేసుకోవచ్చు. వీక్షకులు చదివి తమ రేటింగ్స్ ఇచ్చేలా సైట్ రూపొందించారు. అత్యధిక రేటింగ్ పొందిన స్క్రిప్ట్ లను టాప్ ప్లేస్ లో ఉంచబోతున్నారు. తమ రచనకు వచ్చే రేటింగ్ రైటర్స్ కాన్ఫిడెన్స్ పెంచనుంది. 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్ సైట్ మొదటి ప్రయత్నంగా రచయితలకు మీ ఫేవరేట్ హీరోకు సూపర్ పవర్స్ వస్తే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్‌లను ఇన్వైట్ చేస్తోంది. ఈ సైట్ ద్వారా రైటర్, అసిస్టెంట్ రైటర్, అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినిమాలకు పనిచేసే అవకాశాలు పొందవచ్చు.



# 'మట్కా' నుంచి ర్యాంప్ సాంగ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' నవంబర్ 14న థియే టర్లలోకి రానుంది. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తు న్నారు. ఈ మూవీ సాంగ్స్, టీజర్, ట్రైలర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. మేకర్స్ రామ టాకీస్ ర్యాంప్ సాంగ్ రిలీజ్ చేశారు. భవానీ రాకేష్ అదిరిపోయే బీట్స్ తో అడిక్టివ్ ఫోక్ నెంబర్‌గా ఈ పాటని కంపోజ్ చేశారు. డైరెక్టర్ కరుణ కుమార్ స్వయంగా రాసిన జానపద సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయి దేవ హర్ష పెక్యులర్ వోకల్స్ ఈ పాటని మరింత ప్రత్యేకంగా నిలిపింది. హీరో వరుణ్ తేజ్‌తో పాటు సినిమాలోని కీలక నటీనటులు, స్పెషల్ సెట్స్, షూటింగ్ లోకేషన్స్ ని ప్రజెంట్ చేసిన సాంగ్ మేకింగ్ వీడియో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ నిలిచింది. విన్నవెంటనే కనెక్ట్ అయ్యే ఈ సాంగ్ ఇన్స్టంట్ చార్ట్ బస్టర్ గా నిలిచింది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. నవీన్ చంద్ర, సలోని, అజయ్ ఘోష్, కన్నడ కిషోర్, రవీంద్ర విజయ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'మెకానిక్ రాకీ' నుంచి 'ఐ హేట్ యూ మై డాడీ' సాంగ్



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మోస్ట్ ఎవైటెడ్ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'తో అలరించడానికి రెడీగా వున్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి ఎస్ ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తు న్నారు. ఈ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఇంట్రస్టింగ్ టీజర్, ట్రైలర్ చాలా క్యూరియాసి టీని క్రియేట్ చేసింది. 'మెకానిక్ రాకీ' రాకీ మొదటి రెండు పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. మేకర్స్ 'ఐ హేట్ యూ మై డాడీ' సాంగ్ రిలీజ్ చేశారు. జేక్స్ బిజోయ్ ఈ సాంగ్‌ని థపింగ్ బీట్స్‌తో క్యాచి నెంబర్‌గా కంపోజర్ చేశారు. ఫాదర్ అండ్ సన్ బాండింగ్‌ని హ్యూమరస్ అండ్ ఎంటర్ టైనింగ్ గా ప్రజెంట్ చేసిన ఈ సాంగ్‌ని స్టార్ సింగర్ రామ్ మిరియాల తన మెస్మరైజింగ్ వాయిస్‌తో ఎనర్జిటిక్‌గా పాడారు. సనారే రాసిన లిరిక్స్ ఆకట్టుక ున్నాయి. ఈ సాంగ్ లో ఫాదర్ అండ్ సన్‌గా నరేష్, విశ్వక్ సేన్ బాండింగ్ అందరికీ కనెక్ట్ అయ్యేలా వుంది. విశ్వక్ డ్యాన్స్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. క్యాచి ట్యూన్, లిరిక్స్, ఎనర్జిటిక్ వోకల్స్, సూపర్బ్ పెర్ఫార్మెన్స్ లతో ఈ సాంగ్ ఇన్స్టంట్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది.

# యాక్షన్, డివోషనల్ "ఆదిపర్వం"



రావుల వెంకటేశ్వర్‌రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్ టైన్ మెంట్స్ కలయికలో నిర్మించిన చిత్రం "ఆది పర్వం". ఈ సినిమాలో మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ప్రధాన పాత్రల్లో నటిస్తు న్నారు. మరో కీలక పాత్రను ఆదిత్య ఓం పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా "ఆదిపర్వం" చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. "ఆదిపర్వం" సినిమా ఈ నెల 8న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో ఆదిత్య ఓం మాట్లాడుతూ - ప్రతి నటుడికి, ఫిలిం మేకర్ కు ప్రేక్షకుల దగ్గర నుంచి వచ్చే స్పందనే ఆక్సీజన్ లాంటిది. "ఆదిపర్వం" సినిమాను మీరంతా థియేటర్స్‌లో చూసి ఆ ప్రాణవాయువు మాకు అందిస్తారని కోరుకుంటున్నా. ఈ సినిమాలో హనుమంతు అనే కీ రోల్ చేశాను. ఇలాంటి మంచి క్యారెక్టర్ నాకు ఇచ్చిన దర్శకుడు సంజీవ్‌కి థ్యాంక్స్. "ఆదిపర్వం"లో మీరు థ్రిల్ అయ్యేలా యాక్షన్, డివోష నల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమాకు చిన్నా పెద్దా తేడా లేదు. కంటెంట్ బాగున్న సినిమాను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ నెల 8న "ఆదిపర్వం" థియేటర్స్‌లో చూడండి అన్నారు.



# చిట్టి నడుమునే చూస్తుంటే..

ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీల్లో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన మీనాక్షి చౌదరి ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 20218 కిరీటాన్ని సొంతం చేసుకుంది. మోడలింగ్ లో రాణించిన చాలా మంది సినిమా ఇండస్ట్రీలో రాణించలేక పోయారు. మిస్ ఇండియా, మిస్ వరల్డ్‌గా నిలిచిన వారు కొందరు మాత్రమే సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు. మీనాక్షి చౌదరి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో సక్సెస్ అవ్వడం కష్టమే అని చాలా మంది అనుకున్నారు. అంతా అను కున్నట్లుగానే మొదట్లో ఫ్లాప్స్ చవి చూసిన మీనాక్షి ఇప్పుడు టాప్ హీరోయిన్స్ జాబితాలో చేరింది. తెలుగులో ఇచ్చట వాహన ములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయింది. ఆ సినిమా పెద్దగా ఆడలేదు. దాంతో మీనాక్షి గురించి మీడియాలో పెద్దగా చర్చ జరగలేదు. దాంతో మీనాక్షి చౌదరికి టాలీవుడ్‌లో తదుపరి ఆఫర్ వచ్చేనా అనే అనుమానాలు వ్యక్తం అయ్యా యి. లక్కీగా ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్క డంతో తన సత్తా చాటింది. ఈ ఏడాది గుంటూరు కారం సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటిం చింది. ఆ సినిమా నిరాశ పరచినా మంచి గుర్తింపు మాత్రం తెచ్చి పెట్టింది అనడంలో సందేహం లేదు. తాజాగా దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'లక్కీ భాస్కర్' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.

# "ధూం ధాం" పక్కా ఫ్యామిలీ ఎంటర్ టైనర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తు న్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. నాకు యాక్టింగ్ అంటే ప్యాషన్. సినిమాల్లోకి రావాలని ఎప్పటినుంచో కోరిక. ఫస్ట్ ర్యాంక్ రాజు, బీచ్ రోడ్ చేతన్, రోజులు మారాయి, గల్ఫ్ అనే మూవీస్ చేశాను. ఆ సిని మాల్లో కొన్నింటికి మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. ప్రేక్షకుల నుంచి గుర్తింపు వచ్చింది. నాకు గోపీ మోహన్ స్క్రిప్ట్ ఇష్టం. సకుటుంబంగా ఫ్యామిలీ అంతా ఎంజాయ్ చేసేలా ఆయన స్క్రిప్ట్ ఇస్తారు. అలాంటి మూవీ ఒకటి నేనూ చేయాలని అనుకున్నాను. ఇప్పటిదాకా విభిన్న తరహా చిత్రాల్లో నటిం చాను. ఒకసారి ఒక బిగ్ మూవీ చేద్దామని "ధూం ధాం" మొదలుపెట్టాం. తండ్రీ కోసం కొడుకు, కొడుకు కోసం తండ్రి ఎక్కడిదాకా అయినా వెళ్తారు అనే కాన్సెప్ట్ తో ఈ సినిమాను రూపొందించాం. దానికి అన్ని కమర్షియల్ ఎలి మెంట్స్ జోడించాం. మా మూవీలో ఫాదర్ తన కొడుకు అన్నింట్లో ది బెస్ట్‌గా ఉండాలనుకుంటాడు. ఆయన చేసిన గారాబంతో కొడుకు మరింత అల్లరిగా తయారవుతాడు. తన వల్ల ఒక అమ్మాయి జీవితంలో ఏర్పడిన సమస్యకు తనే పరిష్కారం చూపించాలని ప్రయత్నం చేస్తాడు.

## నిహారిక చేతుల మీదుగా ట్రెండింగ్‌లవ్ ఫస్ట్‌లుక్




వర్ధన్ గుర్రాల, హమరేశ్, శాంతి తివారి, నిత్యశ్రీలు ముఖ్య పాత్రల్లో నటించగా వెల్‌నోన్ షార్ట్‌ఫిలిమ్ మేకర్ హరీశ్ నాగరాజు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ట్రెండింగ్‌లవ్'. దొరకునా ఇటువంటి ప్రేమ ట్యాగ్‌లైన్. తన్వీ ప్రొడక్షన్స్, ఆర్‌డిజి ప్రొడక్షన్స్ పతాకాలపై సంయుక్తంగా నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రానికి సోనుగుప్తా, రూపేశ్ డి గోయల్ నిర్మాతలు. 'ట్రెండింగ్‌లవ్' చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటి, నిర్మాత కొణిదెల నిహారిక చేతులమీదుగా విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ "'ట్రెండింగ్‌లవ్' దర్శకుడు హరీశ్‌తో నేను గతంలో యూట్యూబ్ కోసం చేసిన షార్ట్‌ఫిలింలో పనిచేశాను. ఎంతో టాలెంట్ ఉన్న దర్శకుడు. ఈ సినిమా టైటిల్ సమాజంలో ఉన్న కరెంట్ సిట్యూవేషన్‌ను ఎలివేట్ చేసేలా ఉంది. సినిమాలోని కొన్ని కట్స్ చూశాను. చాలా బావున్నాయి. ఈ టీమ్ అందరికి చక్కని విజయం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారామె.

## త్రిబాణధారి బార్బరిక్

ప్రస్తుతం ఇండియన్ ఫిల్మ్ మేకర్లు ఎక్కువగా మైథలాజికల్ కాన్సెప్ట్‌తో చిత్రా లను తెరకెక్కిస్తు న్నారు. రామా యణ, మహాభారతాల్లోంచి పాత్రలను తీసుకుని సినిమాలను గ్రాండ్‌గా నిర్మిస్తు న్నారు. ఈ క్రమంలోనే భీముడు మనవడు, ఘటోత్కచుడు కుమారుడు బార్బరిక్ (బార్బరికుడు) మీద చిత్రం రాబోతోంది. త్రిబాణ ధారి బార్బరిక అంటూ అదిరిపోయే టైటిల్‌తో చిత్రం రాబోతోంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా విజ యపాల్‌రెడ్డి ఆదిధాల నిర్మించిన ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద తెరకెక్కించిన ఈ చిత్రానికి సంబంధిం చిన మోషన్ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఎవరు తాతా ఇతను?.. ప్రపం చం గుర్తించని ఒక గొప్ప యోధుడమ్మా.. భీష్ముడా? తాతా.. హహ కాదమ్మా.. అంటూ సాగిన డైలాగ్స్.. ఇచ్చిన ఎలివేషన్స్.. ఆర్ఆర్, విజువల్స్ ఇలా అన్నీ కలిపి మోషన్ పోస్టర్ అంచనాలు పెంచేసింది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044